
లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

● ఈబీసీ నేస్తం ద్వారా రూ.34.93 కోట్లు ● జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటిటౌన్, మార్చి 14: వైఎస్‌ఆర్ ఈబీసీ నేస్తం ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లె నుంచి వైఎస్‌ఆర్ ఈబీసీ నేస్తం పథకం కింద 45-60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న అర్హులైన అగ్రవర్ణాలకు అందిన మహిళలకు ఆర్థికసాయాన్ని సీఎం జగన్ నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జేసీతో పాటు బీసీ సంక్షేమశాఖ అధికారి సందప్ప, బీసీ కార్పొరేషన్ ఏఈవో శిరీష, బీసీ కార్పొరేషన్ సీనియర్ సహాయకులు ఓబులేసు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతో పాటు ఇతర ఓసీ సామాజిక వర్గాలకు చెందిన అర్హులైన పేద మహిళలకు వైఎస్‌ఆర్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందుకున్న మహిళలు సొంత వ్యాపారాలు చేసుకుని ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో 23,287 మంది మహిళలకు రూ.34.93 కోట్లు మెగా చెక్కును అందజేశారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల ఫలితాలు వెల్లడి

కలికిరి, మార్చి 14: ఆలిండియా స్థాయిలో నిర్వహించిన సైనిక్ పాఠశాలల ప్రవేశ పరీక్షా ఫలితాలను మంగళవారం రాత్రి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. అయితే ఫలితాల జాబితాను మాత్రం ఇవ్వకుండా విద్యార్థులు వ్యక్తిగతంగా పొందడానికి మాత్రం అవకాశం కల్పించారు. దేశవ్యాప్తంగా సైనిక్ స్కూళ్లలో 5, 9వ తరగతి ప్రవేశాల కోసం గత జనవరి 28న పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. అనంతరం కీ విడుదల చేసి ఫిబ్రవరి 25-27 మధ్యలో జవాబులపై అభ్యంతరాలను తెలపాల్సిందిగా కోరింది. అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం నిష్ణాతుల అభిప్రాయాలను ఎన్టీఏ పరిగణనలోకి తీసుకుని అర్హత సాధించిన విద్యార్థుల జాబితాను సైనిక్ స్కూల్ సొసైటీకి అందజేసింది. ఈ మేరకు పరీక్షల్లో సాధించిన మార్కుల స్కోర్ కార్డును ఎన్టీఏ/ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామ్స్ వెబ్‌సైట్లలో పొందుపరిచింది. విద్యార్థులు తమ అప్లికేషన్ నెంబరు, పుట్టిన తేదీ, సెక్యూరిటీ పిన్‌ను ఎంటర్ చేసి స్కోర్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రకటించారు. కాగా ఈసారి మెరిట్ ప్రాతిపదికన జరిగే ప్రవేశాలకు ఈ-కౌన్సెలింగ్ విధానం ద్వారా ఎంపిక చేయనున్నట్లు ఎన్టీఏ ఒక ప్రకటనలో తెలిపింది. సైనిక్ స్కూల్ ఈ-కౌన్సెలింగ్ వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థులు నమోదు కావలసి ఉంటుందని పేర్కొన్నారు. పాత సైనిక్ స్కూల్స్‌తోపాటు ఈ ఏడాది ప్రారంభమయ్యే కొత్త సైనిక్ స్కూళ్లకు కూడా ఇదే విధానం వర్తిస్తుందని వివరించారు. అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించిన వివరాలను కూడా సంబంధిత వెబ్‌సైట్ ద్వారానే తెలుసుకోవచ్చు.

వివేకా హత్యకు గురై ఐదేళ్లు

● నేడు కడపలోని జయరాజ్ గార్డెన్స్‌లో ఐదో స్మారకోత్సవ సమావేశం
● వివేకా ఆత్మీయులకు సునీతారెడ్డి ఆహ్వానం
● హాజరు కానున్న వైఎస్ షర్మిలారెడ్డి
● ఆత్మీయ సమావేశంపై సర్వత్రా ఆసక్తి



కడప, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిన్నాన్న మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు గురై నేటికి ఐదేళ్లు. సరిగ్గా 2019 సార్వత్రిక ఎన్నికల వేళ ఇదే రోజు (మార్చి 15వ తేదీ) తెల్లవారగానే వివేకా గుండెపోటుకు గురయ్యారంటూ జగన్ చానెల్‌లో బ్రేకింగ్ న్యూస్ వచ్చింది. అయ్యో అనుకునే లోపే గుండెపోటు కాదు గొడ్డలితో లేపేశారనే వార్త దావానలంలా వ్యాపించింది. ఇది అప్పట్లో సంచలనంగా మారింది. చంద్రబాబే చంపించారంటూ జగన్ శిబిరం ఆరోపిస్తూ వచ్చింది. అయితే న్యాయం కోసం వివేకా కుమార్తె సునీత సీబీఐని ఆశ్రయించడంతో నాలుగేళ్లకు వివేకా హత్య కేసు గుట్టురట్టయింది. ఇప్పటికీ నిందితులకు శిక్ష పడలేదు. ఈ నేపథ్యంలో వివేకా కూతురు సునీతారెడ్డి, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి కడప నగర శివారులోని జయరాజ్ గార్డెన్స్‌లో వివేకా ఐదవ స్మారకోత్సవ మరియు జ్ఞాపకార్థ సమావేశాన్ని శుక్రవారం ఉదయం11గంటలకు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వివేకాకు, వైఎస్‌కు సన్నిహితంగా ఉన్న సుమారు 3వేల మందికి ఆహ్వానాలు పంపించారు. ఈ సమావేశానికి సీఎం జగన్ సోదరి, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి హాజరు కానున్నారు.

సర్వత్రా ఆసక్తి

వివేకా హత్య కేసును విచారణ చేపట్టిన సీబీఐ.. ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డితో పాటు మరో అరుగురిపై కేసులు నమోదు చేసింది. ఒక కన్నును మరో కన్ను పొడుచుకుంటుందా అంటూ అసెంబ్లీ సాక్షిగా సీఎం జగన్ సోదరుడు వైఎస్ అవినాశ్‌రెడ్డిని వెనకేసుకు రావడం అప్పట్లో దుమారం రేపింది. సీఎం జగన్‌కు వివేకా కూతురు సునీతతో పాటు సొంత చెల్లెలు షర్మిలారెడ్డి దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగే సమావేశంలో సునీతారెడ్డి రాజకీయంగా ఏమైనా ప్రకటన చేస్తారా అన్న ఆసక్తి అందరిలో నెలకొంది. తన కుటుంబ సభ్యులు ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై ఏమైనా వెల్లడిస్తారా అన్నదానిపై మిగతా పార్టీల కన్నా వైసీపీ నేతలు చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

పార్లమెంటు పరిధిలో ఐదుచోట్ల అభ్యర్థుల ఖరారు

రాబోయే సార్వత్రిక ఎన్నికల కోసం తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు గానూ ఐదుచోట్ల అభ్యర్థులను ఖరారు చేసింది. గత నెలలో రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లె స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించగా గురువారం మదనపల్లె టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పుంగనూరులో చల్లా రామచంద్రారెడ్డి పేర్లను టీడీపీ అధిష్ఠానం ప్రకటించింది. ఇక రాజంపేట, రైల్వేకోడూరుకు సంబంధించి అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. దీంతో పార్లమెంటు పరిధిలో ఐదుచోట్ల ఎన్నికల బరిలోకి దిగే అభ్యర్థులు ఎవరో? తేలిపోగా ఇంకా రెండింటిలో మాత్రం సందిగ్ధత కొనసాగుతోంది. ఇప్పటికే టికెట్లు దక్కించుకున్న అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతుండగా కొత్తగా ప్రకటించిన స్థానాల్లో టికెట్లు పొందిన నాయకులు ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ఇంకా స్పష్టత రాని చోట్ల అధినేత ప్రకటన కోసం ఆశావహులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు.

● మదనపల్లె అభ్యర్థిగా షాజహాన్‌బాషా
● రాజంపేట.. రైల్వేకోడూరుపై కొనసాగుతున్న సందిగ్ధత
● జనసేనకు ఏ సీటు కేటాయిస్తారో.. సర్వత్రా ఉత్కంఠ




షాజహాన్‌బాషా

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాజంపేట పార్లమెంటు పరిధిలో రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. అందులో పుంగనూరు చిత్తూరు జిల్లా పరిధిలోకి వెళ్లగా మిగిలిన స్థానాలు అన్నమయ్య జిల్లాలో ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు గురువారం అసెంబ్లీ స్థానాల అభ్యర్థుల రెండవ జాబితాను ప్రకటించారు. మదనపల్లె అసెంబ్లీ స్థానానికి మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పుంగనూరుకు చల్లా రామచంద్రారెడ్డి (బాబు)ని ప్రకటించారు. అయితే మదనపల్లెలో ప్రస్తుత నియోజకవర్గ ఇన్‌చార్జ్ దొమ్మలపాటి రమేశ్‌తో పాటు పలువురు టికెట్టును ఆశించారు. ఈ నేపథ్యంలో తొలి జాబితా ప్రకటన సందర్భంగా మదనపల్లెను ప్రకటించలేదు. ఇదే సమయంలో అధికార వైసీపీ ఇక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్‌బాషను మార్చి రిటైర్డ్ ఉద్యోగి నిస్సార్ అహ్మద్‌ను బరిలోకి దించింది. ఈ సమీకరణల నేపథ్యంలోనే మైనార్టీ కోటా కింద షాజహాన్‌బాషాకు టికెట్టు దక్కిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

మదనపల్లెకు చెందిన మహమ్మద్ అక్బర్ సాహెబ్, ఎం.రమీజాబీలకు గల నలుగురు కుమారుల్లో ఎం.షాజహాన్‌బాషా రెండో సంతానం. మూడో కుమారుడు ఎం.నవాజ్‌బాషా. ఇద్దరూ సలామత్ ట్రాన్స్‌పోర్టు అధినేతలు కాగా ఎం.నవాజ్‌బాషా ప్రస్తుతం వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతుండగా, అన్న ఎం.షాజహాన్‌బాషా మాజీ ఎమ్మెల్యేగా టీడీపీలో ఉన్నారు. మొదటగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీలో ఉండిన ఎం.షాజహాన్‌బాషా 2004లో మదనపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసింది. అయితే ఎన్నికల ప్రక్రియలో భాగమైన నామినేషన్ల పరిశీలనలో బి-ఫారంలో అప్పటి ఏఐసీసీ ఇన్‌చార్జి గులామ్‌నబీ ఆజాద్ సంతకం లేకపోవడంతో నామినేషన్ తిరస్కరణకు గురైంది. తర్వాత అప్పటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశీస్సులతో తిరిగి 2009లో ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ టికెట్ దక్కించుకుని ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఈ క్రమంలో 2009 నుంచి 2014 వరకూ ఎమ్మెల్యేగా కొనసాగారు. తర్వాత రాష్ట్ర విభజనతో 2014లో కాంగ్రెస్ పార్టీ ఉనికిని కోల్పోయింది. అయినా అదే పార్టీ నుంచి తిరిగి మదనపల్లె నియోజకవర్గం నుంచి శాసనసభ్యునిగా పోటీ చేసి ఓడిపోయారు. కాంగ్రెస్‌లోనే కొనసాగిన షాజహాన్‌బాషా తిరిగి 2019 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి రాజంపేట పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసి వైసీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై ఓటమి చెందారు. అనంతరం 2019-2023 వరకూ కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన 2023 మార్చిలో టీడీపీలో చేరారు. టీడీపీ యువనేత నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర సందర్భంగా మదనపల్లెలో తన అనుచరులతో కలసి టీడీపీలో చేరారు. అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేశారు. అటు కాంగ్రెస్, ఇటు టీడీపీ, మరోవైపు ముస్లిం మైనార్టీ మతపెద్దలతో ఉన్న పరిచయాలతో పార్టీలో మరింత ముందుకెళ్లారు. క్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా మదనపల్లె ఉమ్మడి అభ్యర్థిగా సీటు సాధించడంలో సఫలీకృతమయ్యారు.

పుంగనూరులో మొదటి నుంచి టికెట్ విషయంలో ఎటువంటి పోటీ లేదు. చల్లా రామచంద్రారెడ్డే నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే అదే ప్రాంతానికి చెందిన పారిశ్రామికవేత్త రామచంద్రయాదవ్‌కు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. దీంతో ఒకానొక దశలో ఈయన తెలుగుదేశం పార్టీకి వస్తారనే ప్రచారం జరిగింది. అయితే ఈ ఊహలకు తెర దించుతూ ఈయన సొంతంగా భారత చైతన్య యువజన పార్టీని స్థాపించుకున్నారు. అయినా బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి సందర్భంగా ఈయనకు టికెట్ ఇస్తారేమో అనే ప్రచారం కూడా జరిగింది. దీంతో తొలి జాబితాలో పుంగనూరు టికెట్టును టీడీపీ ప్రకటించలేదు. అయితే రామచంద్రయాదవ్ తన పార్టీ తరపునే పోటీలో నిలిచే అవకాశం ఉండడంతో ఊహాగానాలకు తెరదించుతూ రెండవ జాబితాలో చల్లా రామచంద్రారెడ్డికి టికెట్టును అధినేత చంద్రబాబు ఖరారు చేశారు.

రెండింటిలో సందిగ్ధత

ఐదు స్థానాల్లో స్పష్టత వచ్చినప్పటికీ రాజంపేట, రైల్వేకోడూరు స్థానాల్లో ఇంకా సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ఈ రెండు స్థానాల్లో ఒకటి జనసేన పార్టీకి కేటాయిస్తారనే ప్రచారం ఉంది. ఇప్పటికే రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించినట్లు అనధికారకంగా పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే రాజంపేట స్థానాన్ని కూడా జనసేన అడుగుతున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో తిరుపతి టికెట్టును జనసేనకు కేటాయిస్తారనే ప్రచారం ఉంది. అయితే అక్కడ స్థానికేతరులకు టికెట్టు ఇవ్వవద్దని స్థానిక నాయకులు ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం తిరుపతి టికెట్టును ఆశిస్తున్న వారికి రాజంపేట సీటు ఇస్తారనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ఇక్కడ టీడీపీకే సీటు ఇచ్చే అవకాశం ఉందని కూడా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒకటి రెండు రోజుల్లో ఈ రెండు స్థానాల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

జోరుగా ప్రచారం

మొదటి విడతలో పీలేరుకు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, రాయచోటికి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, తంబళ్లపల్లెలో జయచంద్రారెడ్డిలకు టికెట్‌లు ఇస్తున్నట్లు అధినేత ప్రకటించారు. టికెట్టు దక్కించుకున్న నాయకులు నియోజకవర్గ వ్యాప్తంగా ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ తిరిగి ఓట్లు అడుగుతూ ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మీద వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో ప్రజలు తెలుగుదేశం పార్టీ నాయకులకు బ్రహ్మరథం పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వైసీపీ నాయకులు టీడీపీలో చేరుతున్నారు. ఈ నేపథ్యంలో గెలుపే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ శ్రేణులు రాబోయే ఎన్నికల సమరానికి ముందుకు సాగుతున్నాయి.

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (శుక్రవారం సాయంత్రం)	సెహరీ (శనివారం ఉదయం)
రాయచోటి	6.30	5.01
మదనపల్లె	6.31	5.08
రాజంపేట	6.30	5.04
పీలేరు	6.29	5.06

గుట్టుగా ఉపాధ్యాయ బదిలీలు

● దాదాపు 75 మందికి పైగా ఆర్డర్లు ● ఎంఈవోలకు చేరిన ఆదేశాలు



కడప (ఎడ్యుకేషన్), మార్చి 14: జిల్లావిద్యాశాఖలో అనధికారికంగా ఉపాధ్యాయ బదిలీలు జరిగినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. దాదాపు 75 మందికి పైగా ఉపాధ్యాయులకు ఆర్డర్లు విడుదలైనట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయులను ఒకచోట నుంచి మరో చోటుకు బదిలీచేసేందుకు వైసీపీ ప్రజాప్రతినిధులు, మంత్రులు భారీ స్థాయిలో సిఫారసులు చేశారు. దీంతో దాదాపు 75 మంది ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన ఆర్డర్లు పాఠశాల విద్యాశాఖ డీఈవో కార్యాలయానికి పంపినట్లు తెలుస్తోంది. అవి ఎంఈవోలకు కూడా చేరినట్లు సమాచారం. జిల్లాలో 60 మంది ఎస్‌జీటీలు, 15 మంది స్కూలు అసిస్టెంట్లకు ఆర్డర్లు వచ్చినట్లు సమాచారం.

భారీగా పైరవీలు

ఉపాధ్యాయుల అక్రమ బదిలీల్లో భారీగా పైరవీలు జరిగాయని సమాచారం. ఉపాధ్యాయులు ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీల నుంచి సిఫారసు లెటర్లు తీసుకున్నా.. రాష్ట్ర కార్యాలయంలో భారీగా ముడుపులు చెల్లించాల్సి వస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే జిల్లాకు ఆర్డర్లు వచ్చిన తరువాత ఇక్కడ కూడా కొంత ముట్టచెబుతున్నట్లు సమాచారం. రహస్యంగా చేపట్టిన ఈ అక్రమ బదిలీలపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. సాధారణ బదిలీలు జరిగే సమయంలో తమకు అన్యాయం జరుగుతుందని వాపోతున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఉపాధ్యాయులకు అన్ని విధాలుగా అన్యాయం జరుగుతోందని తాజాగా సిఫారసు బదిలీల ఆర్డర్లతో మరికొంత నష్టం చేసిందని వాపోతున్నారు.

నిర్లక్ష్యం.. ప్రాణం తీసింది

● జాతీయ రహదారి విస్తరణ పనుల్లో ఇష్టారాజ్యం
● మోరీ కోసం తీసిన గుంతలో పడి ద్విచక్రవాహనదారుడు మృతి
● సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదం జరిగిందని ఫిర్యాదు
● కాంట్రాక్టు సంస్థకు చెందిన ఇద్దరిపై కేసు నమోదు


మృతి చెందిన రవీంద్ర


రవీంద్ర(ఫైల్)

ములకలచెరువు, మార్చి 14: నిర్లక్ష్యం...ఒక నిండు ప్రాణం తీసింది. ఓ నిరుపేద కుటుంబాన్ని రోడ్డున పడేసింది. ముంబాయి-చెన్నై జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మోరీ నిర్మాణం కోసం తీసిన గుంత వద్ద ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో అందులో పడి ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు...ములకలచెరువు మండలం సోంపల్లె పంచాయతీ కేసీ నగర్‌కు చెందిన నల్లజోడు రవీంద్ర (45) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతడికి భార్య రాధమ్మ, కుమారుడు సునీల్, కుమార్తె శిరీషా ఉన్నారు. పని నిమిత్తం రవీంద్ర బుధవారం సాయంత్రం ద్విచక్రవాహనంలో ములకలచెరువుకు వచ్చాడు. ఈ క్రమంలో పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ములకలచెరువు రైల్వేస్టేషన్ రోడ్డు సమీపంలో మోరీ నిర్మాణం కోసం తీసిన గుంత కన్పించకపోవడంతో అందులో పడిపోయాడు. గుంత వద్ద సూచిక, మట్టి కుప్పలు తోలకపోవడం, ప్రమాదాన్ని సూచించే రేడియం స్టిక్కర్లు అంటించకపోవడం, తగిన జాగ్రత్తలు పాటించకపోవడంతో ద్విచక్రవాహనంతో సహా గుంతలో పడ్డాడు. ఈ ప్రమాదంలో వ్యక్తి తలకు బలమైన గాయమైంది. స్థానికుల సహాయంతో పోలీసులు రవీంద్రను బయటకు తీసి 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు బెంగళూరుకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. ములకలచెరువులో రోడ్డు విస్తరణ పనులు చేస్తున్న కేసీవీఆర్ సంస్థ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందని మృతుడి భార్య రాధమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసీవీఆర్ సంస్థకు చెందిన సైట్ ఇంజనీరు రవికుమార్, డీపీఎం పూర్ణకుమార్‌రెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. రవీంద్ర మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

రాత్రికి రాత్రే సూచిక బోర్డులు.. మట్టికుప్పలు ప్రత్యక్షం


నిర్మాణంలో ఉన్న మోరీ గుంతలో పడి రవీంద్ర మృతి చెందడంతో కాంట్రాక్టు సంస్థ సిబ్బందిలో చలనం వచ్చింది. ప్రమాదం జరిగిన తరువాత అర్ధరాత్రి మోరీ తీసిన గుంతకు ఇరువైపులా మట్టి కుప్పలు తోలి సూచికలు ఏర్పాటు చేశారు. ముందే ఇలాంటి చర్యలు చేపట్టి ఉంటే ఓ వ్యక్తి ప్రాణం నిలిచేదని స్థానికులు అంటున్నారు.


వ్యక్తి మృతికి కారణమైన మోరీ గుంత

నాటి తరికుండే.. నేటి తరిగొండ

● నేటి నుంచి నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

గుర్రంకొండ, మార్చి 14: మండలంలోని తరిగొండ శ్రీలక్ష్మి నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి వైభవంగా జరగనున్నాయి. పది రోజుల పాటు వైభవంగా జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభ కానున్నాయి. ఆలయం పూర్వం కొన్ని సంవత్సరాల క్రితం దుర్వాస మహాముని ప్రతిష్ఠించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. స్వామివారు మజ్జిగ కుండలో ఉద్భవించినందున ఈ గ్రామానికి తరికుండ అనే పేరు వచ్చిందని తెలుస్తోంది. చోళరాజుల కాలంలో బాకరాపేట సమీపంలోని చిట్టేచర్ల గ్రామంలో రామానాయుడు అనే పాలేరు కుటుంబం ఉండేది. వారికి పశుసంపద ఎక్కువగా ఉండేది. ఈ క్రమంలో వారు ఆ పశువులను మేపుకుంటూ తరికుండ వచ్చారు. ఆ కాలంలో తరికుండ గ్రామం అటవీ ప్రాంతంగా ఉండేది. పశువులు ఇక్కడికి వచ్చి సేదతీరేవి. ఒకరోజు రామానాయుడు దంపతులు మజ్జిగ చిలుకుతుండగా మజ్జిగ కుండలో స్వామివారు ఉద్భవించారు. వారు స్వామివారి విగ్రహాన్ని చూసి ఏదో నల్లటి రాయి అనుకుని కుండలో నుంచి తీసివేయగా మరుసటి రోజు కూడా స్వామివారు మజ్జిగ కుండలో దర్శనమిచ్చారు. ఆరోజు రాత్రి రామానాయునికి స్వామివారు స్వప్నంలో కనిపించి నేనే లక్ష్మినరసింహస్వామిని, తరికుండకు పశ్చిమ భాగాన కొండలో మారెళ్ల గెవిలో ఉన్నానని, ఆ గెవిలో ధనం ఉందని ఆ ధనంతో నాకు ఆలయాన్ని నిర్మించాలని ఆయనకు చెప్పారు. మరుసటి రోజు రామానాయుడు స్వప్న వృత్తాంతాన్ని అందరికీ తెలిపి గెవిలో వెదుకగా వారికి ఆలయ నిర్మాణానికి కావలసిన ధనం దొరికినది. ఆ ధనంతో ఆలయాన్ని పునఃప్రతిష్ఠింపజేశారు. నాటి తరికుండే నేడు తరిగొండగా రూపాంతరం చెందింది.


తరిగొండ శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఆలయం


ఆలయంలో వెలసిన స్వామివారు.. వెంగమాంబ

సత్య ప్రమాణాలకు నిలయం బలిపీఠం

శ్రీలక్ష్మి నరసింహస్వామిని దుర్వాస మహాముని ప్రతిష్ఠిస్తూ ఆయన తపోబలముచే ఆలయంలో ధర్మపీఠం నెలకొల్పారు. స్వామి వారి ఆలయంలో ఎవరైనా అసత్య ప్రమాణాలు చేస్తారో వారి వంశం నిర్వంశం అవుతుందని ఆ మహాముని శపించారు. దీంతో ఆలయంలో ఎవరైనా అసత్య ప్రమాణాలు చేయాలంటే నేటికీ భయపడతారు. అలాగే తరిగొండ వెంగమాంబ స్వస్థలం కావడంతో టీటీడీ ప్రతి ఏటా స్వామి వారి బ్రహ్మోత్సవాలను పది రోజుల పాటు అంగరంగా వైభవంగా నిర్వహించనుంది.

కుడి ప్రసాదాలు పంపిణీ

లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజైన ధ్వజారోహణం రోజు సంతానం లేని మహిళలకు కుడి ప్రసాదాన్ని (సంతాన ప్రసాదం) వేద పండితులు పంపిణీ చేస్తారు. ఈ ప్రసాదం తిన్న మహిళలకు సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో సంతానం లేని మహిళలు ఆలయంలో వరపడడానికి అధిక సంఖ్యలో వస్తారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా..

తరిగొండ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను టీటీడీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. పది రోజుల పాటు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 15వ తేదీ శుక్రవారం సాయంత్రం అంకురార్పణ, 16న ఉదయం ధ్వజారోహణం, రాత్రి హంసవాహనం, 17న ఉదయం ముత్యపు పందిరి వాహనం, రాత్రి హనుమంత వాహనం, 18న ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సింహవాహనం, 19న ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి పెద్ద శేషవాహనం, 20న ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి గజవాహనం, 21న ఉదయం సర్వభూపాల వాహనం, రాత్రి కల్యాణోత్సవం, గరుడసేవ, 22న రథోత్సవం, ధూళిఉత్సవం, 23న ఉదయం సూర్య ప్రభవాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, 24న ఉదయం వసంతోత్సవం, సాయంత్రం ధ్వజావరోహణం, 25న ఉదయం స్నపన తిరుమంజనం, సాయంత్రం పుష్ప యాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.


దుర్వాస మహాముని ప్రతిష్ఠించిన ధర్మపీఠం

అక్రమాలకు అడ్డాగా డీసీఎంఎస్

రైతులకు వెన్నుదన్నుగా నిలవాల్సిన జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ అక్రమాలకు అడ్డాగా మారుతోంది. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వ్యవసాయ పనిముట్లను అందించేందుకు ఏర్పాటు చేసిన సహకార మార్కెటింగ్ సొసైటీకి ఉమ్మడి కడప జిల్లాలోని పలు ప్రాంతాల్లో స్థలాలు ఉన్నాయి. వాటిల్లో చాలావరకు అన్యాక్రాంతమయ్యాయి. మిగిలిన స్థలాలను అయినా కాపాడుకునే పరిస్థితుల్లో డీసీఎంఎస్ పాలకవర్గం, అధికార యంత్రాంగం చిత్తశుద్ధి చూపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో అందిన కాడికి దండుకునేందుకే ప్రయత్నిస్తున్నారు తప్ప ఆస్తులను పరిరక్షించుకునే ప్రయత్నం చేయడం లేదని సమాచారం.



రాజంపేటలో అక్రమంగా నిర్మిస్తున్న కాంప్లెక్స్

• విలువైన స్థలాలు అన్యాక్రాంతం • ఆస్తులను రక్షించాల్సిన వారే.. భక్షిస్తున్నారు • సంస్థ కంటే సంపాదనకే పెద్దపీట



కడప చెమ్ముమియాపేట స్థలంలో నిర్మాణంలో ఉన్న రిఫ్రిజిరేటర్ల తయారీ కేంద్రం

కడప (ఎన్జీఆర్ సర్కిల్), మార్చి 14: కడప నగరం నడిబొడ్డున ఉన్న డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో కార్యాలయంతో పాటు వ్యాపార సముదాయ గదులను నిర్మించి లీజుకు ఇచ్చారు. ఎక్కడైనా ఒకసారి లీజుకు ఇస్తే కొన్ని సంవత్సరాల తరువాత లీజు పెంపు చేసి అగ్రిమెంటు చేస్తారు. అయితే ఇక్కడ మాత్రం అద్దె తగ్గించి లీజు అగ్రిమెంట్లు చేస్తున్నట్లు సమాచారం. ఖాళీగా ఉన్న గదులను డీసీఎంఎస్ కార్యాలయంలోని కొంతమంది సిబ్బంది అనధికారికంగా వినియోగించుకుంటూ అసాంఘికాలకు నిలయంగా మార్చారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

విలువైన స్థలాలు అన్యాక్రాంతం

జిల్లాలో డీసీఎంఎస్‌కు పలుచోట్ల స్థలాలు ఉన్నాయి. ఈ స్థలాలు ఎక్కువ భాగం ఆక్రమణలకు గురవుతున్నాయని అంటున్నారు. రెవెన్యూ డివిజన్ కేంద్రం అయిన రాజంపేటలో స్థలం ఆక్రమించుకున్నట్లు సమాచారం. నియోజకవర్గ కేంద్రమైన కమలాపురంలో ఉన్న స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకుని కట్టడాలు చేపట్టారు. మరికొంత స్థలాన్ని ఇతరులకు విక్రయించినట్లు తెలుస్తోంది. ముద్దనూరు మండలంలో కూడా రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న డీసీఎంఎస్ గోదాం స్థలాన్ని కొంత కాలం క్రితం ఆక్రమించుకునేందుకు ప్రయత్నించగా ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చింది. దీంతో అధికారులు స్పందించి ఆక్రమణలు నిలుపరించారు. కమలాపురం మండలంలోని మరో గ్రామంలో కూడా డీసీఎంఎస్ స్థలాన్ని ఆక్రమించుకున్నారు. వల్లంపేటలో ఉన్న స్థలం కూడా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

రూ.కోట్ల విలువ చేసే స్థలం.. కబ్జాదారుల పరం

కడప నగరంలో చెమ్ముమియాపేటలో డీసీఎంఎస్‌కు సర్వే నెం.563/1లో నాలుగు ఎకరాల స్థలం ఉండేది. 2007లో అప్పటి పాలకవర్గం బహిరంగ వేలం ద్వారా 1.85 ఎకరాలు రూ.2.70 కోట్లకు విక్రయించారు. మిగతా స్థలంలో గోదాంలు, ఖాళీ స్థలం ఉంది. పలు దఫాలుగా ఈ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నం జరిగింది. ఈపీఐసీ కమిటీ రాక ముందు ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా ఉన్న జేసీ కొలతలు వేయించి ఆక్రమణలను నిలువరించ గలిగారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న పర్సన్ ఇన్‌చార్జి కమిటీ, డీసీఎంఎస్‌లోని కొంతమంది అధికారులు కలిసి ఖాళీ స్థలాన్ని ఆక్రమణదారులకు నిబంధనలకు విరుద్ధంగా సుదీర్ఘకాలానికి లీజుకు ఇచ్చినట్లు సమాచారం. ఇందులో సుమారు రూ.50లక్షల మేర చేతులు మారినట్లు చర్చ సాగుతోంది.

లీజుకు కాదు.. అద్దెకిచ్చాం..



కడప నగరంలోని చెమ్ముమియాపేటలో ఉన్న డీసీఎంఎస్ స్థలంలో ఖాళీగా ఉన్న ప్లాట్లను లీజుకు ఇచ్చాం అనేది అవాస్తవం. ఖాళీగా ఉంటే ఆక్రమించుకుంటారనే ఉద్దేశ్యంతో నెలసరి అద్దెకు మాత్రమే ఇచ్చాం. అద్దెకు స్థలాలు పొందిన వారు నిర్మాణాలు చేపడుతున్నారు.

- ఖాదర్‌వల్లి, బిజినెస్ మేనేజర్, డీసీఎంఎస్

రహస్యంగా అప్పగించడం ఏమిటి?

ఓపెన్ టెండర్లు పిలవకుండా రహస్యంగా స్థలాలు అప్పగించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం సంస్థ స్థలాలకు ఓపెన్ టెండర్లు పిలవాల్సి ఉంటుంది. అలా కాకుండా ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికి చెమ్ముమియాపేట స్థలాన్ని అప్పగించినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో స్థలాలు పొందిన వారు ప్లాట్ నెంబరు-1లో 10 సెంట్లు స్థలంలో పర్మినెంటుగా టీ స్నాక్స్ అల్పాహార హోటల్ నిర్మించారు. రెండో ప్లాటులో, మూడో ప్లాటులో 20 సెంట్లలో నిర్మాణానికి సిద్ధపడ్డారు. ప్లాట్ నెం.5లో 10 సెంట్ల స్థలంలో భవన నిర్మాణానికి సిద్ధం చేశారు. మరో ప్లాటులో 30 సెంట్ల స్థలంలో కర్మాగారాన్ని నిర్మించి అందులో రిఫ్రిజిరేటర్లు తయారు చేస్తున్నారు. ప్లాట్ నెం.7లో 10 సెంట్ల స్థలంలో బేస్‌మెంటు వేసి నిర్మాణానికి సిద్ధం చేశారు. సొసైటీ వద్ద కోట్లాది రూపాయలు నిధులు ఉన్నాయి. ఈ ప్రాంతం వ్యాపారానికి చాలా అనుకూలంగా ఉంటుంది. సొసైటీనే వ్యాపార సంస్థలకు అగ్రిమెంటు చేసుకుంటే కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించి అద్దెకివ్వడం ద్వారా సంస్థ మరింత ఆదాయం పొందవచ్చు. అలా కాకుండా నామినేటెడ్ కమిటీ అధికారులు కలిసి ప్రైవేటు వ్యాపారులతో కుమ్మక్కై విలువైన స్థలాన్ని ధారాదత్తం చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్వప్రయోజనాల కోసం సంస్థ ఆస్తులకు పాలకవర్గం నష్టం కలిగించడం, డీసీఎంఎస్ అధికారులు ప్రేక్షకపాత్ర వహించడంపై సహకారశాఖ అధికారులకు, రాష్ట్ర సహకార సంఘాల కమిషనర్, రిజిస్ట్రారుకు ఫిర్యాదులు వెళ్లాయని సమాచారం.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

కడప (క్రైం), మార్చి 14 : కడప నగరంలోని రామచంద్రాపురంలో నివాసం ఉంటున్న జింకా దస్తగిరి అలియాస్ మనోజ్ (29) అనే వ్యక్తి గురువారం ఉదయం కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు, స్థానికులు, బంధువుల సమాచారం మేరకు.. కడప నగరంలోని తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో రామచంద్రాపురంలో నివాసం ఉంటున్న జింకా మహబూబ్‌బీ, హుసేన్‌వలి అలియాస్ వలికి ముగ్గురు సంతానం. దస్తగిరి, సోనీ, సుభాన్. వీరిలో సోని 14 సంవత్సరాల కిందట అనారోగ్యంతో మృతి చెందింది. కుమార్తె మృతి విషయంలో భార్యాభర్తలిరువురికీ మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో మహబూబ్‌బీ, హుసేన్‌వలి విడిపోయారు. ప్రస్తుతం హుసేన్‌వలి మైదుకూరులో నివాసం ఉంటున్నాడు. తన భర్తతో విడిపోయినప్పటి నుంచి రామచంద్రాపురంలోనే నివాసం ఉంటున్న మహబూబ్‌బీ పాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుండేది. పెద్ద కుమారుడు దస్తగిరి అలియాస్ మనోజ్ (29) ఓ ప్రైవేటు పెయింటింగ్ సంస్థలో రాయలసీమ రీజనల్ ఇన్‌చార్జ్‌గా ఉన్నాడు. రెండు సంవత్సరాల క్రితం చిన్నచౌకు ప్రాంతంలోని ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. తరువాత వారి మధ్య విభేదాలు వచ్చి దూరంగా ఉంటున్నారు. కాగా దస్తగిరి సోదరుడు సుభాన్ బీటెక్ చదివి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. ఈ క్రమంలో ఈనెల 13వ తేదీ రాత్రి 10 గంటల వరకు తల్లి, ఇద్దరు కుమారులు కలిసి కబుర్లు చెప్పుకున్నారు. పైగదిలో సుభాన్, బయట వసారాలో తల్లి, కింద గదిలో దస్తగిరి పడుకున్నారు. 14న తెల్లవారుజామున ఉన్నట్టుండి కేకలు వినిపించడంతో సుభాన్ కిందకు వచ్చాడు. ఆ సమయంలో దస్తగిరి శరీరమంతా మంటలతో కాలిపోయింది. స్థానికుల సహకారంతో మంటలను ఆర్పివేసి 108లో కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ వార్డులో చికిత్స పొందుతూ ఉదయం 10.30కు దస్తగిరి మృతి చెందాడు. ఆ సంఘటనలో తల్లికి, కుమారుడికి మధ్య ఏవో మనస్పర్థలు ఏర్పడి పెయింటు పనుల్లో ఉపయోగించే టిన్నర్‌ను చల్లి నిప్పంటించిందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఆమె పరారీలో ఉంది. ఆమె ఆచూకీ తెలిసి, విచారిస్తే నిజానిజాలు తెలుస్తాయని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తమ్ముడు సుభాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలో మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజా తెలిపారు.

నా భార్య బారి నుంచి కాపాడండి

• ఎస్పీని వేడుకున్న బాధితుడు

రాయచోటిటౌన్, మార్చి 14: రాయచోటి పట్టణానికి చెందిన ఒక ప్రభుత్వ ఉద్యోగి తన భార్య నుంచి తనకు రక్షణ కల్పించాలని గురువారం ఎస్పీ కృష్ణారావుకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే... రాయచోటి పట్టణం గాంధీబజార్‌లో నివాసం ఉంటున్న పసుపులేటి కిశోర్‌కుమార్ సుండుపల్లె ఎంపీడీవో ఆఫీసులో టైపిస్టుగా పనిచేస్తున్నారు. ఇతను 2019 సంవత్సరంలో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన నాగేశ్వరి అనే మహిళను వివాహం చేసుకున్నాడు. కిశోర్‌కుమార్ ఉద్యోగరీత్యా ప్రతిరోజూ ఉదయం సుండుపల్లెకు వెళ్లి సాయంత్రానికి ఇంటికి వచ్చేవాడు. ఆ సమయంలో అతడి భార్య ప్రియుడితో ఇంట్లో గడిపేదని, దీనిని గమనించిన కిశోర్‌కుమార్ తల్లి పెంచలమ్మ ఆమెను పలుమార్లు మందలించింది. ఇది మనసులో పెట్టుకుని మా తల్లి పెంచలమ్మను కూడా తన భార్య ఇంట్లో లేకుండా చేసిందని కిశోర్‌కుమార్ ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై భార్యను నిలదీయడంతో ఆమె తనను అంతమొందించి నా ఉద్యోగాన్ని పొందడానికి ప్రియుడితో కలిసి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, అందుకే నేను రెండు నెలల పాటు సెలవు పెట్టి ప్రాణభయంతో రాయచోటిని విడిచి వెళ్లిపోయానని ఆయన ఫిర్యాదులో తెలిపారు. నన్ను ఏదో విధంగా రాయచోటికి పిలిపించి నన్ను నిర్బంధించి ఏదో ఒకటి చేయడానికి నేను కనిపించకుండా పోయినట్లు రాయచోటి పోలీసులకు తన భార్య ఫిర్యాదు చేసిందన్నారు. వారిద్దరూ కలిసి నన్ను చంపే అవకాశం ఉందని, వారి బారి నుంచి నా ప్రాణాలను కాపాడాలని ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో కిశోర్‌కుమార్ పేర్కొన్నారు.

సైనిక్ స్కూలు ప్రవేశాల్లో బాలవికాస్ విద్యార్థుల విజయం



విద్యార్థులను అభినందిస్తున్న బాలవికాస్ స్కూల్ కరస్పాండెంట్ సుబ్బరాయుడు, డైరెక్టరు గంగయ్య

కడప (ఎడ్యుకేషన్), మార్చి 14 : సైనిక్ స్కూలు ప్రవేశ పరీక్షా ఫలితాల్లో కడప నగరంలోని బాలవికాస్ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యున్నత ర్యాంకులు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ సుబ్బరాయుడు, డైరెక్టరు గంగయ్య తెలిపారు. ఆరాధ్యకృష్ణ 275 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 351 ర్యాంకు సాధించిందన్నారు. అలాగే సీబీ నిరుపమారెడ్డి 274 మార్కులతో 396వ ర్యాంకు, పి.కళ్యాణ్‌రామ్ 269 మార్కులతో జాతీయ స్థాయిలో 992వ ర్యాంకు సాధించారన్నారు. అలాగే ఎస్ఎండీ రెహ్మాన్ 261 మార్కులు, ఎం.లక్ష్మి మహేష్ 260, బి.హిమజ 258, ఎం.నరసింహ దినేష్ 256, నైత్రావణిసిద్ధార్థరెడ్డి 257 మార్కులు సాధించారన్నారు.

పరీక్షలకు 78 మంది విద్యార్థులు హాజరు కాగా అందులో 75 మంది విద్యార్థులు ఈ-కౌన్సిలింగ్‌కు క్వాలిఫై అయినట్లు తెలిపారు. ఈ ఫలితాలు వచ్చేందుకు కృషి చేసిన అధ్యాపకులు ధరణీకుమార్, హైమావతి, లావణ్యలను పాఠశాల యాజమాన్యం అభినందించారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటరు ధరణీకుమార్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా సరస్వతీ పూజ

రాయచోటి టౌన్, మార్చి 14: రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం వీరభద్రాలయంలో భక్తిశ్రద్ధలతో సరస్వతిదేవి పూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భద్రకాళీ సమేత వీరభద్రుడి ఉత్సవ విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో సరస్వతిదేవి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి అశ్వ వాహనంపై ఏర్పాటు చేసి పట్టణ పురవీధుల్లో గుండా పార్వేట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అశ్వవాహనం సందర్భంగా నీలకంఠ్రావుపేటకు చెందిన బృందం చెక్కభజన కార్యక్రమం, భజన గురువు తుమ్మల హరినాథ ఆధ్వర్యంలో కోలాటం కార్యక్రమాలతో పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. వాహనాల ఊరేగింపు సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శనం చేసుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.



వీరభద్రాలయంలో సరస్వతిదేవి పూజకు హాజరైన విద్యార్థులు

సీతాకోక చిలుకలపై పరిశోధనలు

• వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 14 : జీవవైవిధ్యతకు కారణమైన సీతాకోక చిలుకలపై విస్తృత పరిశోధనలు జరగాల్సి ఉందని వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ పేర్కొన్నారు. గురువారం వైవీయూ పరిపాలన భవనంలో జంతుశాస్త్ర శాఖ ఆధ్వర్యంలోబయోడైవర్సిటీ బటర్‌ఫ్లై బయాలజీ అండ్ కన్జర్వేషన్ మేనేజ్‌మెంటు జాతీయ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా సుధాకర్ మాట్లాడుతూ గుడ్డు దశ నుంచి సీతాకోక చిలుకగా మారే దశలో క్రమకోర్చి కొత్త రూపాన్ని సంతరించుకుంటుందన్నారు. దాని జీవిత కాలం స్వల్పమైనా అందంగా జీవిస్తూ జీవవైవిధ్యత కాపాడుకుంటుందన్నారు.

సీతాకోక చిలుకలు ప్రకృతి మనకు ఇచ్చిన వరమని, భారతదేశంలో 75 జాతులు గుర్తించినట్లు తెలిపారు. జీవ సమతుల్యతను నిలబెట్టే సౌందర్యాత్మక కళాత్మక కీటకం సీతాకోక చిలుక అన్నారు. పరిశోధనల ద్వారా హైబ్రీడ్ రావాలని రంగంలో విస్తృత పరిశోధనలు జరగాలని యువ పరిశోధకులకు సూచించారు. రిజిస్ట్రారు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఆవరణ వ్యవస్థలో సీతాకోకచిలుకలు కీలకమన్నారు. ఆరోగ్యకర మూన వాతావరణానికి ఆ కీటకం ఎంతో అవసరమని చెప్పారు. ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ సీతాకోక చిలుకల సంరక్షణ జరగాలన్నారు. అనంతరం ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, పుదుచ్చేరి యూనివర్శిటీ ఎకో ఫౌండేషన్‌సీనియర్ వైల్డ్ లైఫ్ బయాలజిస్ట్ వ్యవస్థాపకులు డైరెక్టరు ఎం.భూపేష్‌గుప్త, ఆర్గనైజింగ్ సెక్రటరీ కన్వీనరు వెంకటరమణ జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జంతుశాస్త్ర శాఖ అసిస్టెంటు ప్రొఫెసర్లు డాక్టర్ అనుప్రసన్న, డాక్టర్ వెంకటరమణారెడ్డి, అధ్యాపకులు మరియదాస్, మనస్విత, వేరోనిక విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్

ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు : జేసీ

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 14: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, రవాణా శాఖ, పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన భద్రతా చర్యలపై జేసీ అధ్యక్షతన వివిధ శాఖాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత కమిటీలోని ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ప్రమాదాల బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, స్టడ్స్, కల్వర్టులు, అండర్ పాస్‌ల వద్ద రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు, రవాణాశాఖ పక్కా ప్రణాళికతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు తక్షణ వైద్యం అందించేందుకు సహాయం చేసిన వ్యక్తులకు గుడ్ సమార్టాన్ పథకం కింద నగదు పురస్కారం అందిస్తారని, దీనిపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి రవాణా శాఖ అధికారి దినేశ్ చంద్ర, ఆర్డీవో రంగస్వామి, డీఎస్పీ మహబూబ్‌బాషా, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సహాయ ఇన్‌స్పెక్టర్లు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

గుప్తనిధుల తవ్వకాల ముఠా అరెస్టు

పోరుమామిళ్ల, మార్చి 14: మండలంలోని రేపల్లె గ్రామ సమీపంలో ఉన్న చెన్నకేశవస్వామి ఆలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాల జరుపుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం రేపల్లె గ్రామ సమీపంలో ఉన్న చెన్నకేశవస్వామి ఆలయంలో ఆళ్లగడ్డకు చెందిన శంకర్, మరో ముగ్గురు వ్యక్తులు తవ్వకాలు జరుపుతున్నట్లు విషయం తెలియడంతో వారిని అరెస్టు చేశామన్నారు. అలాగే వారి వద్ద ఉన్న కారును సీజ్ చేసినట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పోరుమామిళ్ల, మార్చి 14 : పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2800 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో ఎస్టీ కాలనీ సమీపంలో కంపచెట్ల దగ్గర పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఒక్క అవకాశం ఇవ్వండి: మండిపల్లి




రాయచోటి 9వ వార్డులో ఇంటింటి ప్రచారంలో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, చిన్నమండెంలో ఎన్నికల ప్రచారంలో మండిపల్లి కుటుంబ సభ్యులు

రాయచోటిటౌన్, మార్చి 14: రాబోయే ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇస్తే.. మున్సిపాలిటీ, మైనార్టీల సంక్షేమం కోసం పాటుపడతానని రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని 9, 10 వార్డుల్లో 3వ రోజు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు మైనార్టీ సోదరులు పూలదండలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి రాయచోటి అసెంబ్లీ స్థానాన్ని, రాజంపేట పార్లమెంటు స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారాయణరెడ్డి కుమారుడు రాహుల్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, బేపారి జాఫర్‌అలీఖాన్, మాజీ కౌన్సిలర్ రషీద్‌ఖాన్, సంజీవరెడ్డి, గఫార్, తదితరులు పాల్గొన్నారు.

రామాపురం: మండలంలోని బండపల్లి, పొత్తుకూరువల్లె, హసనాపురం, గువ్వలచెరువు, కసిరెడ్డిగారిపల్లె గ్రామాల్లో గురువారం రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మొదటిగా కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ హరిజనవాడలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్త ఓబులేసును పరామర్శించారు. అనంతరం గువ్వలచెరువులోని మైనార్టీ నాయకులను కలిశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నమండెం: మండలంలోని మల్లూరు, కొత్తపల్లి గ్రామ పంచాయతీల్లో రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితరెడ్డి, వారి కుటుంబ సభ్యులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు కొత్తపల్లె, హరిజనవాడ, నేరేళ్లవంక, బంగారువాండ్లపల్లె, శ్రీరామ్‌నగర్‌కాలనీ, దిన్నెమీదపల్లె, రోడ్డువారకుర్వపల్లెలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేశారు. ఈ విధ్వంస పాలనకు చరమగీతం పాడాలని, రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే టీడీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని వారు ఓటర్లను అభ్యర్థించారు.

ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తాం : రూపానందరెడ్డి



ఓబులవారిపల్లె, మార్చి 14: ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తామని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా. రూపానందరెడ్డి అన్నారు. మండలంలోని వై.కోట గ్రామంలో గురువారం రూ.5 లక్షల వ్యయంతో వాటర్ ప్లాంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సరైన తాగునీరు లేక ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని ఏపీఎండీసీ ఫౌండేషన్ ద్వారా తమకు వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయించాలని గ్రామస్థులు కొన్నేళ్లుగా కోరినా పట్టించుకోలేదని, దీంతో వెంటనే పరిశుభ్రమైన తాగునీటి వసతి కల్పించేందుకు తమ ఫౌండేషన్ ద్వారా నిధులు వెచ్చించి ఏర్పాటు చేసినట్లు రూపానందరెడ్డి తెలిపారు. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా సరైన నీరు లేక కీళ్ల నొప్పులు, కిడ్నీ సమస్యలు వంటి ఇబ్బందులు పడుతూ ఆసుపత్రులకు డబ్బులు పెట్టుకోలేక ఇబ్బందులకు గురవుతూ ఉన్నామని, రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా తమ సమస్య పరిష్కారం చేయడం ఆనందంగా ఉందని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొక్కసం చలపతి, మాజీ సర్పంచ్ బాలాజీ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించి నీటిని మహిళలకు అందజేస్తున్న రూపానందరెడ్డి

ఆర్ట్ మాస్టర్‌కు బంగారు పతకం



రామాపురం, మార్చి 14: డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆర్ట్ మాస్టర్‌గా పనిచేస్తున్న ఆనందరాజుకు చిత్రకళ బ్రహ్మ అవార్డుతో పాటు సువర్ణ కంకణం బంగారం అవార్డు లభించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్ తెలిపారు. ఈ నెల 10న సికింద్రాబాద్‌లోని హరిహర కళానిలయంలో జరిగిన సదస్సులో ఆయనను సన్మానించినట్లు తెలిపారు. ఆయనకు బంగారు పతకం వచ్చినందుకు కళాశాల ఉపాధ్యాయులు సిబ్బంది, విద్యార్థులు ఆయనను అభినందించారు.

ఘనంగా పోషణ్ పక్వాడా

సుండుపల్లె, మార్చి 14: సుండుపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పొలిమేరపల్లె గ్రామం బీజీ రాచపల్లె అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మమ్మ, ఎంపీహెచ్ఈవో శ్రీనివాసులునాయక్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలు, గర్భవతులు, బాలింతలు సక్రమంగా సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం యోగాంజులమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ అహ్మద్‌బాషా, ఆశావర్కర్ సుగుణమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు శ్రీవాణి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం గురువారం మండలంలోని శెట్టిగుంట, మాధవరంపోడు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఏసీడీపీవో సరళాదేవి మాట్లాడుతూ లబ్ధిదారులైన గర్భవతులు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులకు పోషణ్ పక్వాడా కార్యక్రమం, చిరుధాన్యాల విశిష్టత, ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ గుణవతి, అంగన్వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

చిన్నమండెం, మార్చి 14: పౌష్టికాహారం అందించడమే లక్ష్యమని ఏపీసీఎన్ఎఫ్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణ అన్నారు. మండలంలోని దేవగుడిపల్లె కాలనీలో పూర్తి స్థాయిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రైతులు పండించిన ఉత్పత్తులను వినియోగదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుధారత్న, ఎంటీఎల్ వైష్ణవి, హెచ్ఎన్ఎస్ఎఫ్ఎఫ్ పద్మావతి, మార్కెటింగ్ ఎంటీ సుబ్రమణ్యం ఆచారి, ఎంపీపీ సుగుణ, వీవోఏ సుగుణ, పెద్దన్న, ఎస్‌బీసీఆర్‌పీ పెద్దన్న, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పాఠశాల రికార్డులు తనిఖీ

సిద్దవటం, మార్చి 14: మండలంలోని ఎస్.రాజంపేట, జ్యోతి, గొల్లపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలనుగురువారం మండల విద్యాశాఖాధికారి శంకరయ్య ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా ఉపాధ్యాయ సమయపాలన పాటిస్తూ విధులకు హాజరు కావాలని విద్యార్థులకు అందిస్తున్న జగనన్న గోరుముద్ద నాణ్యత లోపం లేకుండా చూడాలన్నారు.

విద్యార్థులకు వరం: ప్రిన్సిపాల్

లక్కిరెడ్డిపల్లె, మార్చి 14: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఏపీ మోడల్ స్కూల్ వరంలాంటిదని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. 5వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు 6వ తరగతి ప్రవేశం కొరకు దరఖాస్తులను చేసుకోవాలని కోరారు. ఈ మేరకు గురువారం మండలంలోని రవీంద్రనగర్, చాలగుట్టపల్లె, ఎగువవడ్డెపల్లె, దిగువవడ్డెపల్లె బుర్జుపల్లె, జె.వడ్డెపల్లె, ద్వియ్యాలవాండ్లపల్లె, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి ప్రధానోపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మార్చి 1 నుంచి ఈ నెల ఆఖరు వరకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చని వారికి తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగయ్య, నిత్యపూజయ్య శ్రీనివాసులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో మంచి దిగుబడులు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 14: వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వీరయ్య పేర్కొన్నారు. గురువారం దిన్నెపాడు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటలో మొక్కల సాంద్రత చదరపు మీటరుకు 44 మొక్కలు ఉండాలని, దీని ద్వారా పంట మంచి దిగుబడులు వస్తుందన్నారు. ఏ సీజన్‌లోనైనా వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించి పంట సాగుచేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీడీ పద్మజ, డీఆర్‌సీ ఏఓ సుచిత్ర, బీటీఎం రమేష్‌రెడ్డి, పవన్‌కుమార్ రైతులు పాల్గొన్నారు.

కష్టాన్ని ఇష్టంగా మార్చుకోవాలి: ఎస్ఐ

పెనగలూరు, మార్చి 14: తొమ్మిది నెలలు కష్టపడి చదివిన చదువును ఇష్టంగా మార్చుకొని ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులతో పాస్ కావాలని పెనగలూరు ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ ఆకాంక్షించారు. గురువారం చక్రంపేట, నల్లపురెడ్డిపల్లె పాఠశాలలో జరిగిన టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అతిగా సెల్‌ఫోన్ వాడటం మంచిది కాదని, తల్లిదండ్రులను గౌరవించి వారు చెప్పినట్లే నడుచుకోవాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ ఇరుగు పొరుగుల వారికి సహాయపడాలన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి సహకరించండి

నందలూరు, మార్చి 14: మండలంలోని నందలూరు పంచాయతీలో ఉన్న ముస్లిం శ్మశాన వాటికకు ప్రహరీగోడ, విద్యుత్‌లైన్ ఏర్పాటుకు కృషి చేయాలని ముస్లిం మతపెద్దలు కోరారు. ఈ మేరకు జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని కలిసి గురువారం అభ్యర్థించారు. ఆయన తక్షణమే స్పందించి దానికి అవసరమయ్యే సహాయాన్ని అందిస్తామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో నందలూరు ఉపసర్పంచ్ ఇబ్బు, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు : సీఐ

నందలూరు, మార్చి 14: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని రాజంపేట రూరల్ సీఐ మంజునాధరెడ్డి హెచ్చరించారు. 2024 ఎన్నికల దృష్ట్యా ఎస్పీ కృష్ణారావు, రాజంపేట డీఎస్పీ వి.ఎన్.కె.చైతన్య ఆదేశాల మేరకు మండల పరిధిలోని లేబాక గ్రామంలో గురువారం రాజంపేట రూరల్ సీఐ మంజునాధరెడ్డి, ఎస్ఐ అబ్దుల్‌జహీర్, కేంద్ర బలగాలు, పోలీసు సిబ్బందితో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్‌నాయక్, హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజకీయ స్థితిగతులపై చర్చించిన చంద్రబాబు



చంద్రబాబును కలసిన టీడీపీ సీనియర్ నేత విశ్వనాథనాయుడు తదితరులు

రైల్వేకోడూరు, మార్చి 14: నియోజకవర్గ రాజకీయ స్థితిగతులపై మాజీ సీఎం చంద్రబాబు నాయుడు గురువారం ఉండవల్లిలోని తన నివాసంలో రైల్వేకోడూరు సీనియర్ నేత కస్తూరి విశ్వనాథనాయుడుతో చర్చించారు. చంద్రబాబు పిలుపు మేరకు కస్తూరితో పాటు ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, రాష్ట్ర బీసీ నాయకుడు నాయిడోరి రమణయాదవ్ తదితరులు వెళ్లారు. పార్టీ అభ్యర్థి విజయం విషయంలో అందరూ కలసికట్టుగా కృషి చేయాలని చంద్రబాబు సూచించినట్లు వారు తెలిపారు. పార్టీకి పూర్వవైభవం తీసుకుని వస్తామని చంద్రబాబుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. అభ్యర్థి ఎవరైనా వారి విజయానికి కృషి చేస్తామని చంద్రబాబుకు చెప్పామన్నారు. రైల్వేకోడూరులో పలు రాజకీయ విషయాలపై చంద్రబాబు అడిగి తెలుసుకున్నారన్నారు.

'పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలి'

రాయచోటిటౌన్, మార్చి 14: స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు డిమాండ్ చేశారు. గురువారం కార్మిక- రైతు సంఘాల రాష్ట్ర సమితి పిలుపు మేరకు రాయచోటి తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, సీఐటీయూ, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్లుగా రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలు పర్చకుండా రద్దు చేసిన నల్లచట్టాల విధానాలను దొడ్డిదారిలో బీజేపీ ప్రభుత్వం అమలుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, స్మార్ట్ మీటర్ల బిగుంపును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ్‌నాయక్, ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, ఎంఆర్‌పీఎస్ నాయకులు రామాంజనేయులు, సీఐటీయూ, డీహెచ్‌పీఎస్ నేతలు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

- ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి

గాలివీడు, మార్చి 14: రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతాంగ వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతాంగ పోరాటానికి సంఘీభావంగా గురువారం గాలివీడు బస్టాండు వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, రైతు, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వం డౌన్‌డౌన్ అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ అభయహస్తమే మిన్న

● డీసీసీ మైనార్టీ అధ్యక్షుడు అలీఖాన్

రాయచోటిటౌన్, మార్చి 14: వైసీపీ, టీడీపీ పథకాల కంటే కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇందిరమ్మ అభయ హస్తం పథకమే మిన్నగా ఉంటుందని డీసీసీ మైనార్టీ అధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక పాలనలో నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, విద్యుత్ బిల్లులు, ఆర్టీసీ చార్జీలు, వంటగ్యాస్ ధరలు పెరిగి సామాన్య ప్రజలు బతకాలంటే కష్టంగా ఉందన్నారు. ఈ రోజుల్లో జాతీయ కాంగ్రెస్ పార్టీ పేదలకు, మహిళలకు తీసుకువచ్చిన ఇందిరమ్మ అభయహస్త పథకం మహిళలకు వరం లాంటిదన్నారు. గురువారం ఆయన రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి మహమ్మద్‌పురా వీధిలో పలువురు మహిళలతో కలిసి ఇందిరమ్మ అభయహస్త పథకం గురించి వివరించారు.



ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం



జనసేన జెండా ఎగురవేసి సంబరాలు చేసుకుంటున్న శ్రీనివాసరాజు, నాయకులు, కార్యకర్తలు

రాజంపేట, మార్చి 14: పట్టణంలో జనసేన పార్టీ కార్యాలయాల ఎదుట ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు 11వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం జనసేన నేతలు యల్లటూరు శ్రీనివాసరాజు, అతికారి దినేష్, మలిశెట్టి వెంకటరమణ కార్యాలయాల ఎదుట నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీ జెండాలు ఎగురవేసి కేకులు కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అరాచక పాలన సాగిస్తున్న సీఎం జగన్‌ను గద్దె దించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: జనసేన పట్టణ కార్యాలయంలో గురువారం జనసేన ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. కేక్ కట్ చేసి పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా యువ నాయకుడు ముత్యాల కిషోర్ మాట్లాడారు. కార్యక్రమంలో రీజనల్ కో-ఆర్డినేటర్ కుప్పాల జ్యోతి, నాయకులు మర్రి రెడ్డయ్య, అమర్నాథ్, మహేష్, మణి, శంకరయ్య, శివకుమార్, కేవీ నాగేంద్ర, గిరిధర్, ప్రభాకర్, విశ్వనాథ, రమేష్‌రెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: జనసేన ఆవిర్భావ వేడుకలను గురువారం చిట్వేలి జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు, రాష్ట్ర సంక్షేమం కోసం తమ అధినేత పవన్‌కళ్యాణ్ పార్టీని స్థాపించారన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, నరేష్, మాదాసు శివ, అవినాష్, పెంచలయ్య, రియాజ్, తేజ, సాయి కృష్ణ, చక్రి, సుబ్బు, రాజా, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లెలో కేంద్ర బలగాల కవాతు

● ప్రశాంత ఎన్నికలే లక్ష్యం : డీఎస్పీ



రాయవరంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ, సీఐ

సుండుపల్లె,మార్చి 14: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బందోబస్తు నిమిత్తం మండలంలోని రాయవరం, మడితాడు, సుండుపల్లె గ్రామాల్లో కేంద్ర బలగాలు గురువారం కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా, రూరల్ సీఐ తులసీరామ్‌లు మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు తమశాఖ సిద్ధంగా ఉందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎటువంటి సంఘటనలను ఉపేక్షించబోమన్నారు. అనంతరం ఆయన కేంద్ర బలగాలతో కలిసి మండలంలోని అన్ని వీధుల్లో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎస్‌కేఎం హుస్సేన్, ఏఎస్ఐ వెంకట్రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో విధులు సక్రమంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లీలారాణి

రైల్వేకోడూరు, మార్చి 14: ఎన్నికల విధులు అధికారులు సక్రమంగా నిర్వహించాలని రైల్వేకోడూరు ఎన్నికల అధికారిణి బి.లీలారాణి తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఐదు మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అధికారులు, సిబ్బంది సక్రమంగా విధులు, బాధ్యతలు నిర్వహించాలని తెలిపారు. రాజకీయ పార్టీలకు కొమ్ముకాసే విధంగా ఎక్కడా కనిపించరాదన్నారు. లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట తహసీల్దార్లు ఆర్.శివరాముడు, ఈ.శేషగిరిరావు, జ్ఞానేశ్వరి, ఇందిరారాణి, వెంకటనారాయణ, ఐదు మండలాలకు చెందిన ఉప తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం: ఎంపీడీవో

నందలూరు, మార్చి 14: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని ఎంపీడీవో శేఖర్‌నాయక్ సూచించారు. గురువారం నాగిరెడ్డిపల్లెలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో బీఎల్‌వోలు, పంచాయతీ కార్యదర్శులకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు మహబూబ్‌బాష, ఎంఈవో నాగయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయురాలు జయలలిత కుమారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సునీల్, వీఆర్వో రాజు, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

రైల్వేకోడూరు, మార్చి 14: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు గురువారం నేత్ర గివింగ్ బ్యాక్ కమ్యూనిటీ సంస్థ ద్వారా పాలిటెక్నిక్, పాలిసెట్, ఏపీఆర్‌జేసీ ఎంట్రెన్స్ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు చాపల నేతాజి మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్ల నుంచి ఈ ఎంట్రెన్స్ రాసి టాప్ ర్యాంకు-3 సాధించిన వారికి మొదటి బహుమతిగా రూ.12 వేలు, 2వ బహుమతిగా రూ.10 వేలు, మూడవ బహుమతి రూ.8 వేలు ఇస్తామని తెలిపారు. అనంతరం రైల్వేకోడూరు ఎంఈఓ-2 సుందర్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, సంస్థ కోర్ సభ్యులు చాపల విజయ, అమరయ్య, సంపత్‌కుమార్, కిరణ్‌కుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి రూ.10 వేలు సాయం



బాధితురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న గణేశ్

రామాపురం, మార్చి 14: మండలంలోని రాచపల్లె పంచాయతీ బీదవాండ్లపల్లెకు చెందిన దొడ్డి రమణ కుమార్తె డయాలసిస్ వ్యాధితో బాధపడుతుండడంతో ఆసుపత్రి ఖర్చుల కోసం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి గురువారం రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. టీడీపీ అభిమాని గణేశ్ రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లగా స్పందించిన ఆయన మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా బాధితురాలి తల్లిదండ్రులకు గణేశ్ ద్వారా అందించినట్లు తెలిపారు. దీంతో బాధితురాలి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీలో జాప్యం



ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

రైల్వేకోడూరు,మార్చి 14: ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు దాసరాజు జయప్రకాష్‌నారాయణ వర్మ, సీనియర్ నాయకులు కోట శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యంలు ఆరోపించారు. ఈ మేరకు గురువారం రైల్వేకోడూరు మండల అభివృద్ధి అధికారి సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా ఇంత వరకు కార్డులను పంపిణీ చేయలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ విస్తారక్ ఆదినారాయణ, నాయకులు సుబ్బారావు, గౌరీకుమార్, లక్ష్మీనారాయణ, సుహాసిని, యామిని తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా నిరసన



రాజంపేట బైపాసురోడ్డులో నిరసన తెలుపుతున్న దృశ్యం

రాజంపేటటౌన్, మార్చి 14: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక విధానాలకు నిరసనగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. గురువారం పట్టణంలోని బైపాసు రోడ్డుపై వామపక్ష నేతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. వామపక్ష నేతలు రాయుడు, సీఐటీయూ రవికుమార్, సికిందర్‌లు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఉండాలని, ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నేతలు నరసింహులు, నాగేశ్వరరావు, గంగయ్య, మున్నా, హమాలీలు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి: ఎంపీపీ

చిట్వేలి, మార్చి 14: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని ఎంపీపీ చంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపీపీ సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మండల సీనియర్ నాయకులు ఎల్.వి.మోహన్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.వెంకటరంగారావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో 1172 మంది గైర్హాజరు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 14: ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. చివరి రోజున జరిగి కెమిస్ట్రీ, కామర్స్ పేపర్-1 పరీక్షలకు 17,018 మంది విద్యార్థులకు గాను 15842 మంది హాజరు కాగా, 1172 మంది గైర్హాజరైనట్లు డీఈవో సయ్యద్ మౌల తెలిపారు.

స్పెషల్ అసిస్టెంట్ జీపీగా సాంబశివుడు



చిత్తూరు లీగల్, మార్చి 14: స్పెషల్ అసిస్టెంట్ జీపీగా సీనియర్ న్యాయవాది సాంబశివుడును ప్రభుత్వం గురువారం నియమించింది. ఈయన మూడేళ్లపాటు ఎస్టేట్ అబాలిషన్ యాక్ట్ 1948కు సంబంధించిన కేసులను, జేసీ, జిల్లా కోర్టులో ప్రభుత్వానికి సంబంధించిన కేసులను వాదించనున్నారు.

చెక్ బౌన్సు కేసుల్లో ఇద్దరికి జైలు శిక్ష

చిత్తూరు లీగల్, మార్చి 14: చెక్ బౌన్సు కేసుల్లో ఇద్దరికి న్యాయస్థానం ఆరునెలల జైలుశిక్ష విధించింది. చిత్తూరులోని చోళ మండల్ ప్రైవేటు ఫైనాన్స్‌లో తిరుపతికి చెందిన నాగరాజు 2012, జూన్‌నెలలో ట్రాక్టర్ కొనుగోలు కోసం రూ.4.46లక్షల రుణం తీసుకున్నాడు. ఇతడు కంపెనీకి రూ.3,04,000 చెక్ ఇచ్చాడు. ఆ చెక్ బౌన్సు కావడంతో కంపెనీవారు కోర్టును ఆశ్రయించారు. ఈ కేసు గురువారం మొబైల్ కోర్టులో వాయిదా ఉండగా, నాగరాజుపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి కీర్తన అతడికి ఆరునెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

● ఇదే కంపెనీలో పలమనేరుకు చెందిన వెంకటరమణ 2014 నవంబరులో రూ.4,53,000 రుణం తీసుకుని రూ.1,40,000 చెక్కు ఇచ్చాడు. చెక్కు బౌన్సు కావడంతో ఫైనాన్సు కంపెనీవారు కోర్టును ఆశ్రయించారు. ఈ కేసు గురువారం మొబైల్‌కోర్టులో వాయిదా ఉండగా, పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి కీర్తన అతడిపై నేరం రుజువు కావడంతో ఆరునెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

వైఎస్సార్ ఈబీసీ నేస్తం నిధుల జమ



చిత్తూరు, మార్చి 14: జిల్లాలో వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం కింద 23,215 మందికిగాను రూ.34.82 కోట్ల చెక్కును జేసీ శ్రీనివాసులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గురువారం సీఎం జగన్ కర్నూలు జిల్లా బనగానిపల్లె నుంచి బటన్ నొక్కి నిధుల పంపిణీని ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, మేయర్ అముద తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐపై దాడి అంటూ వదంతులు

● అది నిజం కాదంటూ ఖండించిన సీఐ

● అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

రామకుప్పం, మార్చి 14: రామకుప్పం పోలీస్‌స్టేషను ఎదుటే ఎస్ఐపై ఇద్దరు యువకులు దాడి చేశారంటూ వదంతులు వచ్చాయి. వీటిని సీఐ తదితరులు ఖండించారు. వి.కోట మండలం దాసర్లపల్లెకు చెందిన వివాహితతో రామకుప్పం మండలం మణీంద్రం గ్రామానికి చెందిన ఓ యువకుడికి కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. రామకుప్పంలో ఉంటున్న ఆమె.. పది రోజుల క్రితం ఇల్లు ఖాళీ చేసుకుని వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో ఆమెతో రామకుప్పానికి చెందిన యువకుడు జరిపిన సంభాషణ ఆడియో రికార్డింగ్‌ను కెంపసముద్రానికి చెందిన ఓ యువకుడు మణీంద్రంకు చెందిన యువకుడికి వాట్సాప్ ద్వారా పంపాడు. ఇదిలా వుండగా, గురువారం ఆమె రామకుప్పంలో ఉండగా ఆ యువకుడు గుర్తించి.. తనను మోసం చేశావంటూ ప్రశ్నిస్తూ ఆమెను పోలీస్‌స్టేషనుకు తీసుకొచ్చాడు. కొంతసేపటికే రామకుప్పం, కెంపసముద్రానికి చెందిన యువకులు అక్కడకు చేరుకున్నారు. రామకుప్పం, మణీంద్రంలకు చెందిన యువకులు ఘర్షణకు దిగారు. పెద్దయెత్తున అరుపులతో వారు కొట్టుకుంటుండగా స్టేషనులో ఉన్న ఎస్ఐ తమ సిబ్బందితో బయటకు వచ్చి వారిని విడదీసినట్టు సమాచారం. రామకుప్పానికి చెందిన యువకుడికి ఎస్ఐ మద్దతు పలుకుతున్నాడని భావించిన మణీంద్రంకు చెందిన యువకుడు, అతడి సోదరుడు ఎస్ఐపై దాడి చేశారంటూ రామకుప్పంలో వదంతులు వ్యాపించాయి. ఈ వదంతులను కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి, రామకుప్పం ఎస్ఐ శివకుమార్ ఖండించారు. అసలు పోలీస్‌స్టేషను ఎదుట ఘర్షణే జరగలేదన్నారు. అలాంటప్పుడు ఎస్ఐపై దాడి జరిగిందనడం అవాస్తవమని వారు తెలిపారు. ఇటువంటి అసత్య ప్రచారాలు చేసేవారు ఎవరైనా సహించేది లేదని, అలాంటి వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

వివాహితను వేధిస్తున్న యువకుడిపై కేసు

రామకుప్పం, మార్చి 14: వివాహితను వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. వి.కోట మండలం దాసార్లపల్లెకు చెందిన ఓ మహిళ, రామకుప్పం మండలం మణీంద్రంకు చెందిన మంజునాథ్ కొంతకాలంగా సహజీవనం సాగించేవారు. రామకుప్పంలో నివాసముంటున్న ఆమె.. కొన్ని రోజులుగా అతడికి దూరంగా ఉంటోంది. తన కోర్కె తీర్చాలంటూ తరచూ ఆమెను మంజునాథ్ వేధించేవాడు. దీనిపై ఆమె రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. మంజునాథ్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పుంగనూరు బరిలో ముగ్గురు రామచంద్రులు

పుంగనూరు, మార్చి 14: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పుంగనూరు అసెంబ్లీ నుంచి ముగ్గురు రామచంద్రులు పోటీకి సిద్ధమయ్యారు. రెండో జాబితాలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి(చల్లా బాబు)ని గురువారం పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. ఇక, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైసీపీ నుంచి.. బోడే రామచంద్ర యాదవ్ భారత చైతన్యయువజన పార్టీ తరపున బరిలోకి దిగనున్నారు.

నాలుగోసారి పెద్దిరెడ్డి

నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా పీలేరు నుంచి పుంగనూరు అసెంబ్లీకి వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 2009, 2014, 2019లో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి మరోమారు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. గురువారం అధికారికంగా హనుమంతరాయదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి వైసీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు.



రెండో సారి చల్లా

రొంపిచెర్లకు చెందిన టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి తొలిసారి 1989లో పీలేరు నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ప్రస్తుతం టీడీపీ తరపునే అభ్యర్థి. అంటే రెండోసారి అయన పుంగనూరు నుంచి ఎన్నికల బరిలో దిగనున్నారు. ఈయన తాత సీకే.నారాయణ రెడ్డి, 1962లో సీపీఐ ఎమ్మెల్యే కాగా.. తండ్రి ప్రభాకర‌రెడ్డి 1983, 1985లో పీలేరు ఎమ్మెల్యేగా గెలుపొందారు.



రెండోసారి రామచంద్రయాదవ్ పోటీ

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని లక్ష్యంగా చేసుకుని పాలు, పాడిరైతులకు అన్యాయం చేస్తున్నారని విమర్శలు చేస్తూ ముందుకు వెళుతున్న బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ పుంగనూరు నుంచి రెండోసారి ఎన్నికల్లో పోటీకి దిగనున్నారు. గత ఎన్నికల్లో ఈయన జనసేన నుంచి పోటీ చేశారు. కాగా, గురువారం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా చల్లా బాబును ఖరారు చేయడంతో బీసీవైపీ ఒంటరిగా పోటీకి రంగం సిద్ధం చేసుకుంది. ఎన్నికల పొత్తు కుదరకపోవడంతో బీసీవైపీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ పుంగనూరులో పోటీ చేయనున్నారు.





టీడీపీ ఫ్లెక్సీల చించివేత

● పోలీసులకు నేతల ఫిర్యాదు

గంగాధరనెల్లూరు, మార్చి 14: మండలంలోని బాలగంగనపల్లె పంచాయతీ మేనాటంపల్లె బస్టాప్ వద్ద టీడీపీ ఫ్లెక్సీలను బుధవారం రాత్రి వైసీపీ అల్లరిమూకలు చించేశాయని, దీనిపై అప్పటికప్పుడే డయల్ 100కి స్థానిక టీడీపీ నేతలు ఫోన్‌చేసి ఫిర్యాదు చేశారు. టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్ బాబు ప్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ, టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై వింజం, బాలగంగనపల్లె పంచాయతీల్లో గురువారం పర్యటన ఖరారు చేశారు. అందులో భాగంగా బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఈ రెండు పంచాయతీల్లో వివిధ గ్రామాల వద్ద ఫ్లెక్సీలు, జెండాలు, తోరణాలను స్థానిక నేతలు కట్టి సిద్ధం చేశారు. అయితే, బుధవారం రాత్రి కొందరు అల్లరి మూకలు మేనాటంపల్లె రెండు ఫ్లెక్సీలను చించేశారు. అదే సమయానికి ఆ రహదారిలో వెళ్లిన టీడీపీ నేతలు గుర్తించి వెంటనే డయల్ 100కిఫోన్‌చేసి ఫిర్యాదుచేశారు. ఇద్దరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని టీడీపీ ఫ్లెక్సీలను చించేసినవాటిని మొబైల్ ఫోన్లల్లో ఫొటోలు తీసుకుని ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు. ఈసంఘటనపై అనుమానం ఉన్న వ్యక్తులపై ఫిర్యాదుచేయాలని పోలీసులు కోరగా, థామస్ కార్యక్రమం అయినతర్వాత ఫిర్యాదు చేయనున్నట్లు నేతలు పోలీసులకు వివరించారు.

ఎన్నికల షెడ్యూల్ వచ్చిన రోజు నుంచే

అందరూ విధులకు సిద్ధం కండి

● అధికారులకు కలెక్టర్ సూచన

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 14: ఎన్నికల షెడ్యూల్ వచ్చిన రోజు నుంచే ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్, వీఎస్టీ టీమ్స్‌తో పాటు మిగిలిన బృందాల్లోని ఉద్యోగులందరూ ఎన్నికల విధులకు సిద్ధంకావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ సూచించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్యతో కలిసి ఆయన నోడల్ అధికారులతో వివిధ బృందాల నియామకాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా అన్ని విభాగాల బృందాలను సిద్ధం చేయాలని, వారికి కేటాయించిన అసిస్టెంట్ల పేర్లతో కూడిన ఉత్తర్వులను విడుదల చేయాలని డీఆర్వోను ఆదేశించారు. జిల్లా పరిధిలో సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని, వాటికి వీడియో కవరేజ్ చేయించాలన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శివయ్య, భవాని, డ్వామా పీడీ ఎస్. రాజశేఖర్, డీఈవో దేవరాజులు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, డీటీసీ గంగనిరంజన్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

గైర్హాజరైన పీవో, ఏపీవోలకు మరో అవకాశం

చిత్తూరులోని ఎన్నికల శిక్షణ తరగతులకు బుధ, గురువారాల్లో గైర్హాజరైన పీవో, ఏపీవోలకు మరో అవకాశం కల్పిస్తున్నామని కలెక్టర్ షన్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. వారు శుక్ర, శనివారాల్లో చిత్తూరులో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు విధిగా హాజరుకావాలని పేర్కొన్నారు. అప్పుడూ గైర్హాజరైతే వారిపై ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు చేపడతామని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వహించాలి: జేసీ

ప్రతి ఉద్యోగి రాజకీయ పార్టీలకు అతీతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలని, లేకుంటే వేటు తప్పదని జేసీ శ్రీనివాసులు హెచ్చరించారు. చిత్తూరులోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో వేర్వేరుగా శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. రెండో రోజైన గురువారం శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణ కోసం సెక్టోరల్ అధికారుల ద్వారా తగిన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి ఉద్యోగి విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. వైద్యాధికారులు ఇచ్చిన సూచనల మేర ఎన్నికల విధుల నుంచి కొందరికి మాత్రమే మినహాయింపులు ఇచ్చామని, మిగిలిన వారందరూ విధిగా పాల్గొనాల్సి ఉంటుందని చెప్పారు. గతంలో నిర్వహించిన ఎన్నికలకు భిన్నంగా ఈసారి సార్వత్రిక ఎన్నికల విధివిధానాలు ఉన్నాయని, ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానంతో సవరించిన విధానాలను ఎన్నికల విధుల్లో అవలంభించాల్సి ఉంటుందని చెప్పారు.

అమ్మ అలక చూడతరమా!



● వైభవంగా ఆదిదంపతుల పల్లకిసేవ

శ్రీకాళహస్తి, మార్చి 14: శ్రీకాళహస్తీశ్వరుడి శివరాత్రి ఉత్సవాల్లో గురువారం పల్లకి సేవ వైభవంగా జరిగింది.గంగాదేవిని వివాహమాడాడని తెలిసి అలకబూనిన ఆదిశక్తిని బుజ్జగించేందుకు పరమశివుడు ప్రయత్నించడమే ఈ సేవలో ప్రధానాంశం. తొలుత ఆలయంలోని అలంకార మండపంలో ఉత్సవమూర్తులను అలంకరించి వాహన మండపం వద్ద పల్లకీలలో ఆశీనులను చేసి పురవీధుల్లో ఊరేగించారు. జ్ఞానప్రసూనాంబ దేవి పల్లకిలో ఆశీనురాలై ఎదురుగా వున్న దర్పణంలో భక్తులకు దర్శనమిచ్చారు. సౌందర్య లహరి అయిన ఆదిశక్తి అలకలోనూ అద్వితీయమైన తేజస్సుతో భక్తులకు దర్పణంలో దర్శనమిచ్చారు. కోలాట నృత్యాలు, నిప్పుతో విన్యాసాలు, డ్రమ్స్ వాయిద్యాలు, కేరళవాయిద్యాలు, బ్యాండు, వేషధారణలు, కీలుబొమ్మలు, అశ్వరథం, మహిషాసురమర్దిని రథం, మంగళ వాయిద్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. శివనామస్మరణతో చతుర్మాడ వీధులు మార్మోగాయి. ఆలయ చైర్మన్ శ్రీనివాసులు,ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.శివరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు ఏకాంత సేవ జరగనుంది. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా రద్దు చేసిన ఆర్జిత సేవలు శనివారం నుంచి యథావిధిగా అందుబాటులోకి రానున్నాయి.



దర్పణంలో జ్ఞానప్రసూనాంబ దర్శనం

తిరుపతిలో 'ఆరణి' కుంపటి

● కూటమి అభ్యర్థిపై భగ్గుమన్న జనసేన, టీడీపీ నేతలు ● ఇరుపార్టీల నేతల అత్యవసర భేటీ... వాడివేడిగా చర్చ

● పవన్‌కు స్వాగతం... లేదంటే స్థానికులకే టికెట్ ఇవ్వాలి...బయటి వారికిస్తే పనిచేయం

● జనసేన అధిష్ఠానానికి ఇరుపార్టీల అల్టిమేటం

తిరుపతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరపున తిరుపతి అసెంబ్లీ అభ్యర్థిగా జనసేన నుంచి చిత్తూరు సిట్టింగ్ వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేరు ఖరారు కావడంతో తిరుపతిలో టీడీపీ, జనసేన పార్టీల నేతలు భగ్గుమన్నారు. రెండు పార్టీల శ్రేణులు సైతం తీవ్ర నిరుత్సాహానికి లోనయ్యాయి.గురువారం మధ్యాహ్నం నగరంలోని ఒక హోటల్లో అత్యవసరంగా భేటీ అయిన ఇరు పార్టీల నాయకులూ ఈ అంశంపై వాడివేడిగా చర్చించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తిరుపతిలో పవన్ కళ్యాణ్ పోటీ చేసినా, ఆయన ఎవరికి టికెట్ ఇచ్చినా క్షేత్రస్థాయిలో పనిచేయాల్సింది తామేనన్నారు. తిరుపతిలో పోటీ చేయడానికి పవన్ కళ్యాణ్‌ను ఆహ్వానించారు. ఆయన గెలుపుకోసం శాయశక్తులా కలసి పనిచేస్తామన్నారు. ఆయన కాకుంటే తిరుపతి నియోజకవర్గానికి చెందిన ఎవరికి టికెట్ ఇచ్చినా కష్టపడి గెలుపునకు కృషి చేస్తామన్నారు. అలా కాకుండా తిరుపతి స్థానికుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా బయటి వ్యక్తిని అభ్యర్థిగా నిర్ణయిస్తే సహించేది లేదని తేల్చి చెప్పారు. తిరుపతి జనసేన అభ్యర్థిగా ఖరారైన ఆరణి శ్రీనివాసులు సాంకేతికంగా ఇప్పటికీ చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే అని, అధికార పార్టీలో ఎమ్మెల్యేగా వున్న వ్యక్తికి తిరుపతిలో ఎలా టికెట్ ఇచ్చారని ప్రశ్నించారు. చిత్తూరులో ఆరణి శ్రీనివాసులు అవినీతి, అక్రమాలపై చంద్రబాబు మొదలుకుని లోకేశ్ దాకా బహిరంగసభల్లో ఆరోపణలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి గెలుపుకోసం ఇపుడు తామంతా కృషి చేయాలా అని ప్రశ్నించారు. అసలు చిత్తూరులో వైసీపీకే పనికి రాని వ్యక్తి తిరుపతిలో మనకెలా పనికొస్తాడని నిలదీశారు. చిత్తూరులో పనికిరాడనే కదా వైసీపీలో టికెట్ ఇవ్వంది అని ప్రశ్నించారు. జనసేనలో చేరినప్పటికీ శ్రీనివాసులుకు ఇప్పటికీ వైసీపీ ముఖ్యనేతలతో వ్యాపార సంబంధాలు కొనసాగుతూనే వున్నాయని ఆరోపించారు. అతడికోసం పనిచేసేది లేదంటూ మూకుమ్మడిగా తేల్చి చెప్పారు. తిరుపతి నుంచి పోటీకి పవన్ కళ్యాణ్‌ను ఆహ్వానిస్తున్నామని, ఆయన కాకుంటే స్థానికులకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానికేతరుడైన ఆరణి శ్రీనివాసులును కూటమి అభ్యర్థిగా ప్రచారం చేయనివ్వబోమని, అసలు తిరుపతిలోనే అడుగుపెట్టనివ్వబోమని హెచ్చరించారు. టీడీపీ, జనసేన పార్టీల అధిష్ఠానాలు తిరుపతి స్థానికుల ఆత్మగౌరవాన్ని అర్థం చేసుకుని అభ్యర్థి నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ ఆశావహుడు ఊకా విజయ్‌కుమార్, టీడీపీ ముఖ్య నేతలు ఆర్సీ మునికృష్ణ, మబ్బు దేవనారాయణరెడ్డి, పులిగోరు మురళి, జేబీ శ్రీనివాస్, దంపూరి భాస్కర్ యాదవ్, పుష్పావతి యాదవ్, మహేష్ యాదవ్, ఆర్సీ శ్రీనివాసులు, కంకణాల రజనీకాంత్ నాయుడు, ఆనంద్ యాదవ్, జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, నియోజకవర్గ ఇంఛార్జి కిరణ్ రాయల్, ముఖ్యనేత రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిరుపతిలో ఆరణి శ్రీనివాసులు గో బ్యాక్ అంటూ ఫ్లెక్సీలు

గోబ్యాక్ అంటూ ఫ్లెక్సీలు

తిరుపతిలోని పలు ప్రాంతాల్లో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గోబ్యాక్ అంటూ ఆయన ఫొటో ముద్రించిన ఫ్లెక్సీలు వెలిశాయి. ప్రధాన కూడళ్లలో వీటిని జనసేన శ్రేణులే ఏర్పాటు చేయడం గమనార్హం.

నేడు తిరుపతికి రానున్న శ్రీనివాసులు

తిరుపతికి శుక్రవారం ఉదయం ఆరణి శ్రీనివాసులు రానున్నారు.8గంటలకు కపిలతీర్థంలోని సుబ్రమణ్య స్వామి ఆలయంలో పూజలు చేసి తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి చేరుకుని పూజలు చేసి టీడీపీ,జనసేన నేతలను కలవనున్నట్టు తెలిసింది. పలువురు టీడీపీ నేతలను ఫోన్లో సంప్రదించి శుక్రవారం నేరుగా కలిసి మాట్లాడతానని చెప్పినట్టు తెలిసింది.నిజానికి శుక్రవారం తిరుపతిలో స్థానికుల ఆత్మగౌరవ సమావేశం నిర్వహించి, రెండు పార్టీల అధిష్ఠానాలకూ స్థానికుడినే అభ్యర్థిగా నిర్ణయించమని కోరుతూ స్పష్టమైన సందేశం ఇచ్చేందుకు టీడీపీ, జనసేన నేతలు నిర్ణయించారు.అయితే గురువారం రాత్రి పార్టీల అధిష్ఠానాల నుంచి వచ్చిన సూచనలతో ఈ సమావేశాన్ని వాయిదా వేసుకున్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, మార్చి 14: జిల్లాలో అపరిశుభ్ర వృత్తుల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలు ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుకుంటున్న వారికి ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా సాంఘిక సంక్షేమం, సాధికారిత అధికారిణి రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు కుటుంబ వార్షిక ఆదాయంతో పనిలేదన్నారు. డే స్కాలర్ విద్యార్థులకు ఏడాదికి రూ.3వేలు, వసతి భవనంలో ఉండే వారికి రూ.8వేల ఉపకార వేతనాన్ని మంజూరు చేస్తామన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి అర్హులైన విద్యార్థులు సంబంధిత సచివాలయంలో వచ్చే నెల 10వ తేదీ లోపు నవశకం లాగిన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సంబంధిత ఎంపీడీవోలు, కమిషనర్లు లబ్ధిదారులను ఏప్రిల్ 20వతేదీలోపు ఎంపిక చేసి సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయానికి పంపాలని ఆమె కోరారు.

తిరుమలలో ఎన్ఎస్‌జీ

తిరుమల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు కట్టుదిట్టమైన భద్రతను కల్పించడంలో భాగంగా గురువారం సాయంత్రం ఎన్ఎస్‌జీ (నేషనల్ సెక్యూరిటీ గార్డ్) బృందాలు చేరుకున్నాయి. శ్రీవారి దర్శనార్థం ప్రముఖులతోపాటు వేలాది మంది భక్తులు తిరుమలకు వస్తుంటారు. వారికి భద్రత పెంచడం కోసం టీటీడీ కొన్ని రోజుల క్రితం హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా ఆధ్వర్యంలో చర్చలు జరిపిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే తిరుమల భద్రత విషయంలో ఎన్ఎస్‌జీని భాగస్వామ్యం చేశారు. మాక్‌డ్రిల్ నిమిత్తం ఎన్ఎస్‌జీ బృందాలు గురువారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నాయి. శ్రీవారిసేవా సదన్ వద్ద సమావేశమై యాక్షన్ ప్లాన్‌పై చర్చించారు. ఆక్టోపస్, పోలీస్, విజిలెన్స్ విభాగాలతో కలిసి అర్ధరాత్రి ఆలయం వద్ద డ్రిల్ నిర్వహించనున్నారు.



సేవాసదన్ వద్ద ఎన్ఎస్‌జీ సిబ్బంది

నీటి సంపులో పడి యువతి మృతి

మదనపల్లె, మార్చి 14: మదనపల్లె మండలం పెంచుపాడు పంచాయతీ పందిళ్లపల్లెలో ఓ యువతి నీటిసంపు(ఫారమ్ పాండ్)లో పడి మృతిచెందినట్లు తాలూకా ఎస్ఐ మోహన్‌నాయక్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు..పందిళ్లపల్లెకు చెందిన శాంతమ్మ, మల్లికార్జునల కుమార్తె భారతి(18)..అదే గ్రామంలోని మేనమామ రెడ్డిశేఖర్ ఇంట్లో ఉంటోంది. ఈ క్రమంలో రెండురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన భారతి..గురువారం గ్రామం సమీపంలో వ్యవసాయ పనులకు నిల్వ చేసిన నీటిసంపులో మృతదేహం లభించింది. భారతి తల్లి ఇది వరకే..ఆత్మహత్య చేసుకోగా, రెండేళ్లక్రితం తండ్రి మల్లికార్జున అనారోగ్యంతో మృతిచెందాడు. పదో తరగతి వరకు చదువుకున్న భారతి..చదువు మానేసి మూడేళ్లుగా అక్క వద్ద తమ్ముడు శివశంకర్‌తో కలసి ఉంటోంది. అమావాస్య రోజులకు రెండురోజులు అటు, ఇటు మతిస్థిమితం లేకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయి నీటిలో పడిపోయినట్లు ఎస్ఐ తెలిపారు. ఇదివరకే రెండుసార్లు నీటిలో పడిపోయిందన్నారు. మృతురాలి అక్క జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక జిల్లా ఆసుపత్రికి తరలించారు. భారతి మృతిపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

వ్యక్తి అరెస్టు ..20లీటర్ల సారా స్వాధీనం

నిమ్మనపల్లి, మార్చి 14: గుట్టుచప్పుడు కాకుండా నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 20లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ నిమ్మనపల్లి పంచాయతీకి చెందిన కందూరు క్రిష్టప్ప(58) గ్రామంలో నాటుసారా విక్రయిస్తుండగా తన సిబ్బందితో దాడి చేసి అతనిని పట్టుకొని అతని వద్ద నుంచి నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. త్వరలో ఎన్నికలు రానుండంతో పకడ్బందీగా తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు.

చీటీల స్కామ్ నిందితులను వెంటనే అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న బీవైఎస్ అధ్యక్షుడు పునీత్‌కుమార్

మదనపల్లె, మార్చి 14: మదనపల్లెలో చీటీల పేరుతో ప్రజల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి మోసం చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని బహుజన యువసేన(బీవైఎస్) అధ్యక్షుడు పునీత్‌కుమార్ డిమాండ్ చేశారు. బాధితులు, బీవైఎస్ నాయకులతో కలసి పట్టణంలో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పునీత్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీలతోపాటు వ్యాపారులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల నుంచి చీటీల పేరుతో సొమ్ములు వసూలు చేసి తిరిగి వారికి చెల్లించకుండా స్వాహా చేశారని ధ్వజమెత్తారు. సమాజంలో పెద్దమనిషిగా చెలామణి అవుతున్న వీఆర్ఎస్ గ్రాండ్ అధినేత వి.సుధాకర్‌రెడ్డి, ఆయన మేనేజర్‌గా చెబుతున్న కృష్ణారెడ్డి, బాషాలపై టూటౌన్ పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేసిన అంశాన్ని పునీత్‌కుమార్ ప్రస్తావించారు. మూడురోజులుగా వందమంది బాధితులు స్టేషన్ చుట్టూ తిరుగుతుంటే తూతూమంత్రంగా కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేయకుండా పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బాధితులకు తగిన న్యాయం చేయకుంటే సుధాకర్‌రెడ్డి వీఎస్ఆర్ గ్రాండ్ హోటల్ ముందు బాధితులతో కలసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో విజయకుమారి, లోకేష్‌బాబు, రామకృష్ణ, సుబ్బారెడ్డి, బీవైఎస్ నేతలు హరీష్, వేణుగోపాల్, నవీన్, ఆది, నితీష్, దిలీప్, శశికుమార్, దేవేష్, జగదీష్ పాల్గొన్నారు.

వన్‌బీ నమూనా కోసం ఓ రైతు పాట్లు



తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతు గుర్రప్ప

గుర్రంకొండ, మార్చి 14:బ్యాంకులో తీసుకున్న క్రాప్‌లోన్ రెన్యూవల్ చేయడానికి అవసరమైన వన్‌బీ నమూనా లో వీఆర్వో సంతకం కోసం రోజుల తరబడి తిరుగుతున్నా కరుణించడంలేదంటూ ఓ రైతు వాపోయాడు. మండలంలోని నంగనమ్ముద్రం పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన రైతు జి.గుర్రప్ప గుర్రంకొండలోని ఓ బ్యాంకులో భూమి పట్టాదారు పాసుపుస్తకాన్ని తాకట్టు పెట్టి క్రాప్ లోన్ తీసుకున్నాడు. ఈ క్రమంలో క్రాప్ లోన్‌ను రెన్యూవల్ చేయడానికి బ్యాంకుకు వెళ్లగా బ్యాంకు అధికారులు వన్‌బీ నమూనా తీసుకురావాలని చెప్పారు. అయితే నంగనమ్ముద్రం పంచాయతీలో భూముల రీసర్వే జరుగుతుండడంతో ఆన్‌లైన్‌లో వన్‌బీ నమూనా రాదు. ఈ నేపథ్యంలో భూముల వివరాలున్న తెల్లకాగితంపై వీఆర్వో, తహశీల్దార్ సంతకం చేస్తే రైతులకు బ్యాంకు అధికారులు లోన్‌లను రెన్యూవల్ చేస్తున్నారు. ఈ క్రమంలో రైతు గుర్రప్ప 20 రోజులుగా క్రాప్ లోన్ రెన్యూవల్ చేయడం కోసం తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నాడు. ఈ విషయమై వీఆర్వో పుల్లయ్య వివరణ కోరగా ఓటర్ల జాబితా, ఎన్నికల బూత్ కేంద్రాల పనిలో ఉండడంతో ఆలస్యమైందన్నారు. రైతు గుర్రప్ప భూముల వివరాలను రికార్డులు పరిశీలించి వన్‌బీ నమూనాపై సంతకాలు చేయిస్తామన్నారు.

మోడల్ స్కూల్, కేజీబీవీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దమండ్యం, మార్చి 14: మండలంలోని పెద్దమండ్యం మోడల్‌స్కూల్, సిద్దవరం కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరం ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోడల్ ప్రిన్సిపాల్ రామాంజులునాయక్, కస్తూర్బా బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ రాణికుమారి వెల్లడించారు. మండలంలోని పెద్దమండ్యం మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఈ నెల 31 వతేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కోరారు. అలాగే సిద్దవరం కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం వరకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కోరారు. ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలియజేశారు. అలాగే 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు కూడా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని వారు కోరారు.

ప్రైవేటు స్కూల్స్‌లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

తంబళ్లపల్లె, మార్చి 14: విద్యాహక్కు చట్టం ప్రకారం 2024-25 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత ప్రవేశం పొందడానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో త్యాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి 2018 జూన్ 2వ తేదీ నుంచి 2019 మే 31వ తేదీ మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు విద్యార్థి, తల్లితండ్రుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, విద్యార్థి జనన ధృవపత్రంతో సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో కానీ, స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో కానీ, స్థానిక సచివాలయంలో కాని దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. .

నిరుద్యోగులను దగాచేసిన వైసీపీ

● గ్రూప్ -1లో అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలి ● తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి, నాయకులు

ములకలచెరువు, మార్చి 14: వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను దగా చేసిందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువు బస్టాండు సర్కిల్‌లోని ముంబాయి - చెన్నై జాతీయ రహదారిలో గురువారం వైసీపీ ప్రభుత్వం చేసిన గ్రూప్ -1 అక్రమాలపై కళ్లకు గంతలు కట్టుకుని రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్- 1 పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు ఎంతో ఆశగా ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు దక్కుతాయని అనుకుంటే ప్రభుత్వ పెద్దల హస్తంతో పరీక్షలు, నియామకాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. వైసీపీ నేతలు 169 పోస్టులను తెగనమ్ముకున్న ఘనత వైసీపీ ప్రభుత్వానికి దక్కుతుందని ధ్వజమెత్తారు. రాజకీయ మూల్యాంకనంతో నిరుద్యోగుల గొంతు కోశారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏ రకమైన పెట్టుబడులు రాష్ట్రానికి రాకపోవడంతో ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు లేక నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు పడుతుంటే జాబ్ క్యాలెండర్ పేరుతో సీఎం జగన్ యువతను అత్యంత దారుణంగా దగా చేశారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో నిరుద్యోగులు వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్దా, వైజీ సురేంద్ర యాదవ్, జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కువైట్ శంకర్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ వేడుకలు



మదనపల్లె పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత

మదనపల్లె, మార్చి 14: మదనపల్లెలో జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆపార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించడంతోపాటు కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఇందులోభాగంగా కమ్మవీధిలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంగారపు స్వాతి ఆధ్వర్యంలో, స్థానిక బర్మావీధిలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు ఆధ్వర్యంలో వేర్వేరుగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ అధినేత పవన్ కళ్యాణ్ ప్రజాసంక్షేమానికి, రాష్ట్ర భవిష్యత్తుకోసం పార్టీని స్థాపించి ఎన్నో పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ఈ క్రమంలో వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ ధ్యేయంగా జనసేన..టీడీపీ, బీజేపీతో పొత్తుపెట్టుకుని ముందుకెళ్తున్న అధినేత అడుగు జాడల్లో మనమంతా నడుద్దామని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేనేత రాష్ట్ర విభాగం ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర, సనావుల్లా, గజ్జల రెడ్డెప్ప, పవన్, శంకర్, రాజారెడ్డి, కుమార్, చంద్రశేఖర్, నాగరాజు, జమిలి మోహన్‌కృష్ణ పాల్గొన్నారు. అలాగే బర్మావీధిలోని పార్టీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత అధ్యక్షతన జరిగిన వేడుకల్లో జనసైనికులు, వీరమహిళలు మల్లిక, రూప, కుప్పాల శంకర్, కోటకొండ చంద్రశేఖర్, అశ్వత్, ధరణి, సుప్రీంహర్ష, సోను, నవాజ్, శ్రీనివాసులు, శ్రీనాథ్, గణేష్, యాసిన్, తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువులో: స్థానిక బస్టాండు సర్కిల్‌లో గురువారం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్‌లు భారీ కేక్‌ను కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు విజయం సాధించడం ఖాయమన్నారు. అంతకు ముందు రైల్వేగేటు నుంచి బస్టాండు సర్కిల్ వరకు భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పాలగిరి సిద్దా, వైజీ సురేంద్రయాదవ్, మాజీ జడ్పీటీసీ శంకర్, బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, టీడీపీ జనసేన పార్టీల నేతలు వెంకీ, మనోహర్, ప్రతాప్‌రెడ్డి, బావాజీ, మురళీ, నరేంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పీలేరులో: జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని పీలేరు మండలంలోని జనసైనికులు, టీడీపీ శ్రేణులతో కలిసి గురువారం ఘనంగా నిర్వహించారు. పీలేరు మండలం దొడ్డిపల్లె పంచాయతీ బెస్తపల్లెలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి కలప రవి, పీలేరు మండల పార్టీ అధ్యక్షుడు పల్లెపు మోహనకృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి గ్రామస్తులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారం కోసం కాకుండా సిద్ధాంతాలు, రాష్ట్రాభివృద్ధి కోసం తమ అధినేత పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని స్థాపించారని తెలిపారు. ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారే సతీశ్ కుమార్ రెడ్డి, సుభాష్, జనసైనికులు గురుమోహన్, గజేంద్ర, విష్ణు, రెడ్డిప్రసాద్, గణేశ్, రాజేశ్, బాలు, పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి గ్రామంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, జనసేన ఇన్‌చార్జి బెజవాడ దినేష్‌తో కలిసి కేక్ కట్ చేసి పంచిపెడుతూ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా నిరుపేదలకు వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈకార్యక్రమంలో జనసేన వాల్మీకిపురం, గుర్రంకొండ అధ్యక్షులు కిశోర్, మహేష్, ఉపాధ్యక్షులు ప్రభాకర్, బాలాజి, భాస్కర్, మహేష్, యువ నాయకులు నవీన్, ప్రభు, ప్రశాంత్, గురు, పవన్‌కళ్యాణ్, రెడ్డెప్ప, నాగార్జున పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: పీటీఎంలో గురువారం జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పార్టీ గౌరవాధ్యక్షుడు ముద్దసాని నాగరాజు ఆధ్వర్యంలో జనసేన, టీడీపీ నాయకులు కలసి కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ముద్దసాని నాగరాజు మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భవించి 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జనసేన, టీడీపీ కలయికతో రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో కూటమి విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివానంద, చింతకాయల వినోద్, సాయి, బీజేపీ నాయకులు శివయ్య గౌండర్ రెడ్డెప్ప, బాబు, ఓబులేసు, సుబ్రమణ్యం, హరి, భూషణ్ పాల్గొన్నారు.

పదోతరగతి అమ్మాయితో పీఈటీ పరార్

మదనపల్లె, మార్చి 14: మదనపల్లెలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థినితో మరో ప్రైవేటు పాఠశాలకు చెందిన పీఈటీ పరారయ్యాడు. పాఠశాలకు వెళ్లిన అమ్మాయి తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. మొదట్లో యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసిన తాలుకా పోలీసులు ఆపై విచారణ చేపట్టి ఇద్దరిని అదుపులోకి తీసుకోవడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై తాలుకా సీఐని వివరణ కోరగా ఇద్దరిని స్టేషన్‌కు తీసుకొచ్చామని, అయితే అతను పీఈటీ ఉపాధ్యాయుడా కాదా అన్నది తెలియాల్సి ఉందన్నారు.

వేలం ద్వారా రూ.42.42 లక్షలు ఆదాయం

కలకడ, మార్చి 14:కలకడ పంచాయితీకి వేలం పాటల ద్వారా రూ.42,42,100 ఆదాయం వచ్చినట్లు ఈవోఆర్డీ లతీఫ్‌ఖాన్ తెలిపారు. గురువారం మదనపల్లె డీఎల్పీవో నాగరాజు ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. దినసరి టమోటా మార్కెట్‌ను షఫీవుల్లా రూ.23.25 లక్షలకు, వారపు సంతను శ్రీహరినాయుడు రూ.13.23 లక్షలకు, ప్రైవేట్ బస్టాండును ఖాదర్‌వలి రూ.1.60 లక్షలకు దక్కించుకున్నారు. అలాగే జంతువధశాల, మూడు గదులకు వేలం నిర్వహించారు. గత ఏడాది కంటే రూ.8,04900 అదనపు ఆదాయం పంచాయితీకి వచ్చింది.

నిమ్మనపల్లి ఎంపీడీవోగా శాలెట్

నిమ్మనపల్లి, మార్చి 14: నిమ్మనపల్లి ఎంపీడీవోగా తిరుపతి జిల్లా బీఎన్ కండ్రిగ మండలంలో పని చేస్తున్న కె.శాలెట్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన మైథిలి శాంతిపురంకు బదిలీ అయ్యారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల బదిలీలపై నిమ్మనపల్లి వచ్చినట్లు తెలిపారు.

రాబోయేది టీడీపీ-బీజేపీ- జనసేన ఉమ్మడి ప్రభుత్వమే



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి

తంబళ్లపల్లె, మార్చి 14: రాష్ట్రంలో రాబోయేది టీడీపీ-బీజేపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వమేనని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ-జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం జయచంద్రారెడ్డి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డిని తంబళ్లపల్లెలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జయచంద్రారెడ్డి మాట్లాడుతూ...ఈ ఐదేళ్ల పాలనలో అధికార పార్టీ నాయకులు తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా దోచుకున్నారన్నారు. అనేక మంది టీడీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి సామాన్య ప్రజల భూములను ఆక్రమించుకున్నారని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వం రాగానే రైతుల నుంచి తీసుకున్న భూములను తిరిగి ఇప్పిస్తామన్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉందని రానున్న ఎన్నికల్లో ఈ అరాచక ప్రభుత్వాన్ని తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో కొండ్రెడ్డి మాట్లాడుతూ..ఈ అరాచక ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు. రాబోయే ఎన్నికల్లో అందరం కలసికట్టుగా పనిచేసి తంబళ్లపల్లెలో టీడీపీ-జనసేనను గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇద్దామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో కేంద్ర బలగాల కవాతు



పెద్దమండ్యం, మార్చి 14: పెద్దమండ్యం, కలి చెర్లలో గురువారు కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. త్వరలో జరుగునున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు జరుగునున్న నేపథ్యంలో శాంతిభద్రతలు దృష్టిలో ఉంచుకొని ముందస్తు గా కేంద్ర బలగాలు పెద్దమండ్యం మండలంలో కవాతు నిర్వహించారు. ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత ప్రజలు అచితూచి వ్యవహ రించాలని పోలీసులు తెలిపారు. సీఐలు నాగేంద్ర, మధు, ఎస్ఐలు హరహర వరప్రసాద్, ఏఎస్ఐలు మధుఆచారి, ఇషాక్, ఎస్ఎస్‌బీ కేం ద్ర బలగాలు పాల్గొన్నారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి



విద్యా సామగ్రిని అందజేస్తున్న హెచ్ఎం

కలకడ, మార్చి 14:పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని కోన హైస్కూల్ హెచ్ఎం చెంగల్‌రాయులు సూచించారు. గురువారం పాఠశాలలో టెన్త్ విద్యార్థులు 15 మందికి సొంత నిధులతో విద్యా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యలో తొలి మెట్టును అధిగమించి ఉన్నత చదువులో రాణించి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కోరారు.

ఫ్రాన్స్ దేశీయుని సైకిల్ యాత్ర

రామసముద్రం, మార్చి 14: ఫ్రాన్స్ దేశానికి చెందిన ఆంటోని అనే వ్యక్తి సైకిల్‌పై విదేశ యాత్ర చేపట్టారు. వివిధ దేశాల సంసృతి, సంప్రదాయాలు తెలుసుకోవాలనేది అతని ఆకాంక్ష. ఈ దృఢ నిశ్చయంతో ఫ్రాన్స్ నుంచి చైనా వెళ్లి అక్కడ ఒక సైకిల్ కొని గత నాలుగు నెలలుగా పాకిస్తాన్ వెళ్లి అక్కడి నుంచి తమిళనాడుకు చేరి గురువారం పుంగనూరు మీదుగా రామసముద్రం వచ్చాడు. ఇక్కడికి నుంచి బెంగళూరు మీదుగా గోవా వెళ్లనున్నట్లు ఆంటోని తెలిపారు. ఇతని ఆత్మవిశ్వాసంను అభినందిస్తూ మండల మాలమహానాడు అధ్యక్షుడు అంబరీష్ ఆంటోనిని శాలువతో సత్కరించారు. ఈ సత్కారానికి ముగ్దుడైన ఆంటోని కరచాలనంతో అంబరీష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఐన్‌స్టీన్, కార్ల్‌మార్క్స్‌లకు నివాళులు

వాల్మీకిపురం, మార్చి 14: ప్రపంచ ప్రఖ్యాత భౌతికశాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జయంతి, సోషియలిస్ట్ విప్లవకారుడైన కార్ల్‌మార్క్స్ వర్ధంతి సందర్భంగా వారికి ఘనంగా నివాళులర్పించారు. గురువారం వాల్మీకిపురం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని గండబోయనపల్లె, జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ వారి సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు ప్రభుచరణ్, పాఠశాల హెచ్ఎం రెడ్డిమోహన్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, కిశోర్, శేఖర్, ఉషారాణి, హీరా జున్నీసా, రూప, సిలార్బీ విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా అనధికార లే-అవుట్లు

నిమ్మనపల్లి, మార్చి 14: మండలంలో కొందరు రియల్టర్లు ఎలాంటి అనుమతులు లేకుండా వ్యవసాయభూములను కన్వర్షన్ చేయకుండానే లే-అవుట్ వేసి ప్లాట్లను అమ్ముతుండడంతో వాటిని కొనుగోలు చేసిన వారికి ఇబ్బందులు తప్పడంలేదు. మండలంలో దాదాపు ఇలాంటి లే-అవుట్‌లు 9నుంచి 10వరకు వున్నాయి. అయితే వ్యవసాయ భూముల్లో లే-అవుట్‌లు వేసిన రియల్టర్లు కన్వర్షన్ చేయకుండా ప్లాట్లను అమ్మకాలు చేపడుతున్నారు. లే-అవుట్‌లలో 10శాతం ప్రభుత్వానికి ఇతర అవసరాల కొరకు భూమిని కేటాయించాలి. అలాగే 40అడుగుల రోడ్లు, కాలువలు, కరెంటు సదుపాయం కల్పించాలి. లే-అవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులు ఇళ్లు కట్టుకోవాలంటే ప్లాన్ అప్రూవల్ అవసరం. దీంతో ఇప్పటికే ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు సంబంధిత రియల్టర్లను సదుపాయాల గురించి అడిగినా వారి నుంచి సరైన సమాధానం ఇవ్వలేదని తెలిపారు. దీనికి తోడు సంబంధిత రెవెన్యూ అధికారులు కూడా తోడవంతో యథేచ్ఛగా ప్లాట్ల విక్రయాలు చేపడుతున్నట్లు ఆరోపణలున్నాయి. స్థానిక బస్టాండు సమీపంలో రెండు ఎకరాల వ్యవసాయభూమిలో, కొండయ్యగారిపల్లి పంచాయతి బొంగవారిపల్లి సమీపంలో, కందూరు, తవళం రోడ్డులో వేసిన లే-అవుట్లకు ఎక్కడా అనుమతులు లేవు. దీనిపై పంచాయతి కార్యదర్శి వెంకటరమణను వివరణ కోరగా ఇప్పటి వరకు ఒక్క లే-అవుట్‌కు కూడా అనుమతులు తీసుకోలేదని లే-అవుట్‌లు వేసిన వ్యక్తులకు నోటీసులు జారి చేసినా వారు స్పందలేదని తెలిపారు.

జగన్ అరాచకపాలనకు అంతిమ ఘడియలు



నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి,బెజవాడ దినేశ్‌లను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

వాల్మీకిపురం, మార్చి 14: రాష్ట్రంలో సైకో సీఎం వైఎస్ జగన్ అరాచక పాలనకు అంతిమఘడియలు వచ్చేశాయని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు అభ్యర్థి అయిన నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి నుంచి ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. స్థానిక గుంటిగంగమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి అక్కడి నుంచి వందలాది మంది టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలోని ఇంటింటా ఇరుపార్టీల ఉమ్మడి మేనిఫెస్టోతో రూపొందించిన సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించి రాబోయే ఎన్నికల్లో తనను గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జన సేన ఉమ్మడి ప్రభుత్వం అధికారం చేపట్టడం ఖాయమన్నారు. అనంతరం గ్రామంలో నూతన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ మహిత శేషాద్రిరెడ్డి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బెజవాడ దినేశ్, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, పీలేరు తెలుగు యువత ఉపాధ్యక్షుడు లంకిపల్లె మధు, మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, టీడీపీ, జనసేన నాయకులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

ముస్లింల మద్దతు టీడీపీ గెలుపునకు సోపానం



ముస్లింలతో కలిసి ప్రచారం చేస్తున్న తనూజారెడ్డి

కలికిరి, మార్చి 14: ముస్లిం మైనారిటీలు చూపిస్తున్న అభిమానం, ఆదరణలు టీడీపీ గెలుపునకు ప్రథమ సంకేతాలని టీడీపీ అభ్యర్థి కిశోర్‌కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆమె మంగమ్మనగర్, బీడీ కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తనూజారెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగా నే ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కలికిరి ఎంపీటీసీ గాయత్రి, సర్పంచు ప్రతాప్‌కుమార్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, మధుసూదన రెడ్డి, భాస్కర్ రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, అవినాష్ రెడ్డి, జ్ఞానమూర్తి, జనసేన అస్లామ్, వైజాగ్ బాషా, పాల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థిగా షాజహాన్‌బాషా ప్రకటనపై సంబరాలు



షాజహాన్‌బాషాకు మద్దతుగా ర్యాలీ చేస్తున్న టీడీపీ శ్రేణులు

మదనపల్లె, మార్చి 14: మదనపల్లె టీడీపీ అభ్యర్థిగా ఎం.షాజహాన్‌బాషా పేరును అధిష్ఠానం ప్రకటించడంపై పట్టణంలోని ఆ పార్టీశ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ శ్రేణులతోపాటు ఆయన అభిమానులు చేసుకున్న సంబరాలు అంబరాన్ని అంటాయి. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పేరు ప్రకటించగానే, స్థానిక బెంగళూరు బస్టాండులో బాణాసంచా పేల్చారు. అక్కడి నుంచి మల్లికార్జున సర్కిల్, ఎన్‌టీఆర్ సర్కిల్, నీరుగట్టువారిపల్లె, అంబేడ్కర్ సర్కిల్, సీటీఎం రోడ్డు మీదుగా ద్విచక్ర వాహన ర్యాలీ కార్యాలయానికి చేరుకున్నారు. టీడీపీ జిందాబాద్, చంద్రబాబు జిందాబాద్, షాజహాన్‌బాషా నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీనేతలు పఠాన్ ఖాదర్‌ఖాన్, పూలకుంట్ల హరి, టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ ఎస్.విద్యాసాగర్, బాలుస్వామి, జునైద్ అక్బరీ, గౌతమ్‌రెడ్డి, షంషీర్, నవీన్‌చౌదరి, నాగూర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.



బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకొంటున్న టీడీపీ నేతలు

నిమ్మనపల్లిలో: మదనపల్లె టీడీపీ అభ్యర్థిగా షాజహాన్‌బాషాకు టికెట్ రావడంతో మండలంలోని టీడీపీ నేతలు మాజీ మండల అధ్యక్షుడు రాజన్న ఆధ్వర్యంలో సంబరాలు చేసుకొన్నారు. గురువారం స్థానిక ఆలయంలో పూజలు నిర్వహించి బస్టాండు కూడలిలో బాణ సంచా పేల్చి మిఠాయిలు పంచుకొని వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీపతి, రమణ, రామకృష్ణ, పమాజ్, ఖన్‌సాబ్, జయన్న, రెడ్డెప్ప జగదీష్, షఫి తదితరుల పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎం చేయడమే ధ్యేయం



సంబరాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు

రామసముద్రం, మార్చి 14: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధినేత నారా చంద్ర బాబునాయుడును ముఖ్యమంత్రిని చేసి తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తేవడమే ధ్యేయమని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు స్పష్టం చేశారు. మదనపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను ప్రకటించడం పట్ల విజయ్‌కుమార్‌గౌడు ఆధ్వర్యంలో మండల తెలుగు తమ్ముళ్లు భారీగా బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచి హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా విజయ్‌కుమార్‌గౌడు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో మండలంలో ఏ విధమైన అభివృద్ధి జరగలేదని, గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులు కూడా ప్రభుత్వం దోచుకుందని విమర్శించారు. అందుకే ప్రజలు ఈ అరాచక ప్రభుత్వాన్ని గద్దెదించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడం ఖాయమ న్నారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శివశంకర్, మాజీ సర్పంచ్ రెడ్డెప్ప, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు చెంగారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడు, డాక్టర్ శివ, కృష్ణప్ప, సీనప్ప, శ్రీనివాసులు, ఒంటిల అల్తాఫ్, రమేష్ అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండో జాబితాతో టీడీపీ శ్రేణుల్లో పెరిగిన జోష్



మాట్లాడుతున్న పార్లమెంట్‌అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేష్

మదనపల్లె అర్బన్, మార్చి 14: తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు రెండో విడతలో 34 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల జాబితాను ప్రకటించడంతో పార్టీ శేణుల్లో జోష్ పెరిగిందని టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీ పీ విముక్తి ఏపీనే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏర్పడిందన్నారు. సీట్ల సర్దుబాటు దృష్ట్యా కొన్ని చోట్ల ఆశావాహులకు టిక్కెట్లు దక్కకపోయి ఉండవచ్చని అంత మాత్రాన పార్టీ ప్రాధాన్యత తగ్గిపోదన్నారు. రాష్ట్రంలో ఉమ్మడి అభ్యర్థులు అఖండ మెజార్టీతో గెలుపొంది ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

పంటలకు మద్దతు ధరల చట్టం అమలు చేయాలి



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ములకలచెరువు, మార్చి 14: స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరల చట్టం తీసుకురావాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆమేరకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, నియోజకవర్గ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డి, సీపీ ఐ మండల కార్యదర్శి అంజనప్పలు స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద గురువారం ఏఐటీ యూసీ, రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వేమనారాయణ, ఉత్తన్న, చంద్ర, మహబూబ్‌బాషా, షాహీన్‌సాబ్, శేషాద్రి, మైకాలి, చంద్ర పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చండి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

బి.కొత్తకోట, మార్చి14: కేంద్ర ప్రభుత్వం రైతు సంఘాలకు ఇచ్చిన రాతపూర్వక హామీని వెటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లాప్రధాన కార్యదర్శి కృష్ణప్ప, తంబళ్లపల్లె నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. రాష్ట్ర రైతుసంఘాల కో ఆర్డినేషన్ కమిటీ పిలుపు మేరకు గురువారం బి. కొత్తకోట జ్యోతిచౌక్‌లో ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల రుణాలన్నింటినీ మాఫీ చేయాలని, విద్యుత్ చట్టసవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రఘునాథ్, తంబయ్యశెట్టి, చిన్నరెడ్డెప్ప, నారాయణస్వామి, అష్రఫ్‌అలీ, శంకర, ఉత్తన్న, గంగన్న, కదిరెప్ప, యల్లప్ప, రమణ,హబీబ్ పాల్గొన్నారు.